నవోదయలో ఖాళీ సీట్ల భర్తీకి

దరఖాస్తుకు నేటితో గడువు ముగింపు



నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్ మండల కేంద్రంలోని జవహర్‌లాల్ నవోదయ విద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరానికి 9వ తరగతి, 11వ తరగతిలలో ఖాళీల భర్తీకి దరఖాస్తుకు నేడు(బుధవారం) గడువు ముగుస్తున్నట్టు ప్రిన్సిపల్ సత్యవతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అలాగే 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. ప్రవేశ పరీక్ష 8 ఫిబ్రవరి 2025న నిర్వహించనున్నట్టు తెలిపారు. https://navodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పీఎం కిసాన్ లింకుతో

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు



నవతెలంగాణ-రామారెడ్డి

పిఎం కిసాన్ లింకు సోషల్ మీడియాలో పంపి సైబర్ నేరగాళ్లు అందిన కాడికి దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. మండలంలోని అన్నారం క్లస్టర్ వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌కు వాట్సప్‌కు మంగళవారం లింకు వచ్చింది. క్లిక్ చేయడంతో వాట్సప్ గ్రూపులలో ఫార్వర్డ్ కావడం, అతని ఫోను హ్యాంగ్ అయింది. దీంతో అలర్ట్ అయిన అధికారి మండలంలోని రైతులకు, గ్రూపులో ఉన్న సభ్యులకు మెసేజ్ పెట్టి అలర్ట్ చేశారు. పిఎం కిసాన్ దరఖాస్తుకు సంబంధించిన ఎలాంటి లింకు వచ్చినా క్లిక్ చేయవద్దని వ్యవసాయ అధికారి శ్రీనివాస్ కోరుతున్నారు.

ప్రజాభిప్రాయం మేరకు

రిజర్వేషన్ల ఖరారుకు ప్రతిపాదనలు

- తెలంగాణ బీ.సీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ వెల్లడి
- నిజామాబాద్‌లో బహిరంగ విచారణ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 128 విజ్ఞప్తులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజలు వ్యక్తపరిచిన అభిప్రాయాలు, సలహాలు, సూచనలతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల విశ్లేషణ కోసం ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సందర్భంగా వెల్లడయ్యే అంశాలను పరిగణలోకి తీసుకుని స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల దామాషాపై తెలంగాణ బీసీ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర ప్రతిపాదనలతో కూడిన నివేదికను సమర్పిస్తుందని కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ తెలిపారు. ఈ నివేదిక పూర్తిగా శాస్త్రీయ పద్ధతిలో ఉండేవిధంగా కమిషన్ చిత్తశుద్ధితో కృషి చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆయా రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజల నుండి అభ్యర్థనలు స్వీకరించేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలోని సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మిలతో కూడిన బృందం మంగళవారం నిజామాబాద్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిజామాబాద్, కామారెడ్డిలతో కూడిన ఉమ్మడి జిల్లాకు సంబంధించి బహిరంగ విచారణ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది.

బీసీ సంఘాల నాయకులు, వివిధ వర్గాల వారు హాజరై రాతపూర్వకంగా విజ్ఞాపనలు కమిషన్ కు అందిస్తూ, మౌఖికంగా కూడా తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 128 విజ్ఞప్తులు వచ్చినట్టు తెలిపారు. నిజామాబాద్ జిల్లా నుంచి 102, కామారెడ్డి జిల్లా నుంచి 26 వినతులు వచ్చాయి. బహిరంగ విచారణ ప్రక్రియకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పర్యవేక్షణలో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. నిర్దేశిత నమూనాలో అఫిడవిట్ తో కూడిన వినతులు కమిషన్‌కు సమర్పించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించేలా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేశారు.



కుల సంఘాల నుంచి సూచనలు వింటున్న అధికారులు

ఈ సందర్భంగా కమిషన్ విధివిధానాల గురించి చైర్మన్ జి.నిరంజన్ క్లుప్తంగా వివరించారు. స్థానిక సంస్థల పాలక వర్గాల పదవీ కాలం పూర్తయ్యి ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుండి వచ్చే నిధులు నిలిచిపోయాయని అన్నారు. దీంతో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సమాయత్తం అవుతోందని, ఇందులో భాగంగా స్థానిక సంస్థలలో ఆయా వర్గాలకు కల్పించాల్సిన రిజర్వేషన్లపై అధ్యయనం కోసం బీ.సీ కమిషన్ బహిరంగ విచారణలు నిర్వహిస్తోందని తెలిపారు. నవంబర్ మొదటి వారం నుండి రాష్ట్రంలో చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా అన్ని వర్గాల ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులు వెల్లడి కానున్నాయని, రిజర్వేషన్ల ఖరారుకు సర్వే అంశాలు దోహదపడతాయని ఆశాభావం వెలిబుచ్చారు. బీహార్ రాష్ట్రంలో 62 శాతం బీసీల జనాభా ఉందని, దీని ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేయాలని అక్కడి ప్రభుత్వం భావించగా, ఆ రాష్ట్ర హైకోర్టు నిరాకరణ తెలిపిందని అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో సైతం సర్వే నిర్వహించినప్పటికీ గత దశాబ్ద కాలంగా నివేదికను వెల్లడించని పరిస్థితి నెలకొని ఉందన్నారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని తెలంగాణ రాష్ట్రంలో పూర్తిగా శాస్త్రీయ పద్ధతిలో రిజర్వేషన్ల ఖరారుకు ప్రతిపాదనలు రూపొందించాలని కమిషన్ గట్టి కసరత్తులు చేస్తోందని తెలిపారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సర్వేను పూర్తి చేస్తామని, ఇంటింటికి వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరిస్తూ పూర్తి సమాచారంతో కూడిన వివరాలను నమోదు చేయించాలని, ఈ దిశగా ప్రజలను చైతన్యపరచాలని కుల సంఘాల ప్రతినిధులను చైర్మన్ కోరారు. నవంబర్ 13 వ తేదీ వరకు సర్వే పూర్తవుతుందని, అనంతరం ఆన్ లైన్ లో డేటాను నిక్షిప్తం చేసి డిసెంబర్ 09 లోగా ప్రభుత్వానికి, రాష్ట్ర హైకోర్టుకు నివేదిక అందజేస్తామని తెలిపారు. బహిరంగ విచారణ సందర్భంగా ముఖ్యంగా విద్య, సామజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణపై ప్రజలు తమ స్థితిగతులను వెల్లడిస్తూ, రిజర్వేషన్లు కోరుతున్నారని అన్నారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక విశ్లేషణకై సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం ఎన్యూమరేటర్లను, సూపర్వైజర్లను గుర్తించినట్టు తెలిపారు. మాస్టర్ ట్రైనర్లచే వారికి సర్వే అంశాలపై శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క కుటుంబం సైతం మినహాయించబడకుండా ప్రతి ఒక్కరి సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాలను సమగ్రంగా సేకరించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు.

నిజామాబాద్ రూరల్ శాసన సభ్యులు డాక్టర్ భూపతి రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావు, వివిధ సంఘాల ప్రతినిధులు కమిషన్ కు తమ అభిప్రాయాలను తెలియజేశారు. కమిషన్ బహిరంగ విచారణ ప్రక్రియలో స్పెషల్ ఆఫీసర్ సతీష్, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



విజ్ఞప్తులు ఇచ్చేందుకు అవగాహన కల్పించేందుకు హెల్ప్‌డెస్క్

అభ్యర్థనలు పంపొచ్చు

కాగా, బహిరంగ విచారణలో నేరుగా కలువలేకపోయిన కుల సంఘాలు, ప్రజలు ఏవైనా సూచనలు, సలహాలు ఇవ్వాలనుకుంటే వచ్చే నెల నవంబర్ 13వ తేదీ, సాయంత్రం 5.00 గంటల లోగా హైదరాబాద్ లోని బీసీ కమిషన్ కార్యాలయం, ఖైరతాబాద్, జలమండలి, 4 వ అంతస్తులో నేరుగా కానీ, పోస్టు ద్వారా కూడా అభ్యర్థనలు పంపవచ్చని సూచించారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

క్యూబా ప్రజలకు అండగా నిలబడదాం

- క్యూబాపై అమెరికన్ సామ్రాజ్యవాద నిరంకుశ, నిర్బంధాన్ని ఖండిద్దాం
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

క్యూబా ప్రజలకు అండగా నిలబడదామని, క్యూబాపై అమెరికన్ సామ్రాజ్యవాద నిరంకుశ నిర్బంధాన్ని ఖండిద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. నిజామాబాద్ నగరంలోని పులాంగ్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. 'గత 31 సంవత్సరాలుగా జనరల్ అసెంబ్లీ క్యూబాకు వ్యతిరేకంగా అమెరికా విధించిన ఆర్థిక, వాణిజ్య ఆర్థిక దిగ్బంధనానికి ముగింపు పలకాలి అనే తీర్మానాన్ని అత్యధిక మెజారిటీతో ఆమోదించింది. గత 63 సంవత్సరాలుగా దిగ్బంధనం వల్ల క్యూబా ఆర్థికంగా 164.14 బిలియన్ డాలర్లను నష్టపోయింది. ద్రవ్యోల్బణం రీత్యా చూస్తే ఇది మొత్తం 1.499 ట్రిలియన్ డాలర్లు. ట్రంప్ అధికారంలో ఉన్నప్పుడు అమెరికన్లు క్యూబాకు ప్రయాణించటానికి అడ్డంకులు కల్పిస్తూ అనేక కొత్త కొత్త నిబంధనలను జారీ చేసింది. అవే ఆంక్షలు, నిబంధనలు అమెరికా అధ్యక్షుడు బైడెన్ పరిపాలనలో కూడా కొనసాగుతున్నాయి.ప్రస్తుతం ఉన్న వ్యవసాయ యంత్రాల నిర్వహణకు అవసరమైన ఇంధనం, నూనెలు, లూబ్రికెంట్ల కొరత, ఎరువులు, పురుగు మందుల కొరత టన్నుల కొద్దీ ఉత్పత్తులను శీతలీకరించే సామర్థ్యం కోల్పోవడం వంటి కారణాల వల్ల ఆహార ఉత్పత్తి తగ్గింది. ఈ దిగ్బంధనం వల్ల సహకార సంఘాలు రైతులు వాడే యంత్రాల కోసం విడి భాగాలు, ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, ఇతర రవాణా సాధనాలు అందుబాటులో లేక వ్యవసాయం స్తంభించిపోయినది. క్యూబా నేడు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దాదాపు మొత్తం ద్వీపంలోని 11 మిలియన్ల జనాభాలో 10 మిలియన్ల ప్రజలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. అక్టోబర్ 17న దాని ప్రధాన థర్మో ఎలక్ట్రిక్ పవర్ ప్లాంట్ సేవలను నిలిపివేయటంతో మొత్తం విద్యుత్ వ్యవస్థ పతనమైంది. ఈ సంక్షోభానికి ముఖ్య కారణం థర్మో ఎలక్ట్రిక్ పవర్ ప్లాంట్లకు శక్తినిచ్చే ఇంధనం లేకపోవడం, ఇంధన చమురుతో కూడిన ఓడ రాక ఆలస్యమవటం వల్ల పరిస్థితి మరింత జటిలమైంది. దీనికి అంతిమ కారణం క్యూబాపై అమెరికా విధించిన వాణిజ్య ఆర్థిక దిగ్బంధనమే. ఈ దిగ్బంధనం ప్రధాన లక్ష్యం ఆకలితో క్యూబా జనాభా మరణిస్తే, ప్రజలు వారి అధికారులకు వ్యతిరేకంగా తిరగబడతారు. అమెరికా ఈ దుష్ట పన్నాగం నెరవేరలేదు. కానీ, క్యూబా ప్రజలు దైనందిన జీవితాన్ని గడపటానికి నిత్యావసరాల కొరత వల్ల అంతులేని కష్టాలు ఎదుర్కొంటున్నారు.అక్టోబర్ 28, 29 తేదీల్లో క్యూబాపై విధించిన క్రిమినల్ దిగ్బంధనాన్ని తొలగించే తీర్మానంపై ఐక్యరాజ్యసమితి మరోసారి చర్చిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా దేశాల్లో సంఘీభావ కార్యక్రమాలు చేపడుతున్నారని, దీంట్లో భాగంగా జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించినట్టు' తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కటారి రాములు, కృష్ణ, ముజీబ్, ఇమ్రాన్, బండారి సాయి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్




కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

సమగ్ర ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పక్కగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమాన్ని నిర్వహించుటకు ప్రతీ ఇంటింటి సర్వే చేపట్టాలని, ఏ ఒక్క ఇల్లు కూడా తప్పి పోకుండా సర్వే చేయాలని అన్నారు. సర్వే కోసం ఎన్యుమారేటర్ లను నియమించాలని, వారికి శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఎన్యుమరెటర్లకు అపాయింట్మెంట్ ఉత్తర్వులు జారీచేయాలని సూచించారు. ప్రభుత్వం జారీచేసిన ప్రశ్నావళి లోని అన్ని అంశములకు సంబంధించిన వివరాలు ఎన్యుమారెటర్లు సేకరించాలని తెలిపారు. ప్రతీ ఎన్యుమారెటర్ కు అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు ఎన్యుమరేషన్‌పై పర్యవేక్షణ ఉండాలని అన్నారు. ఏన్యుమరేషన్‌కు అవసరమైన సామాగ్రి సమకూర్చాలని తెలిపారు. మండల స్థాయిల్లో ఏన్యుమారెటర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సర్వేను పకడ్బందీగా, పక్కగా నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సి. పి. ఓ. రాజారాం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో నూతన ఒరవడికి శ్రీకారం

- విద్యార్థులకు రోబోటిక్స్‌పై అవగాహన



రోబోటిక్స్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-బీబీపేట్

బీబీపేట్ మండల కేంద్రంలోని తిమ్మయ్య గారి సుశీల నారాయణరెడ్డి బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం జిల్లా విద్యాధికారి రాజు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధరామరెడ్డి ఆధ్వర్యంలో విద్యా రంగంలో నూతన ఉరవడిని తీసుకువచ్చే విధంగా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి సోహం అకాడమీ రోబోటిక్స్ కార్యక్రమం ప్రారంభించి విద్యార్థులకు రోబోటిక్స్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రోబోటిక్ ప్రాథమిక సూత్రాలు నేర్చుకున్నారు. పాఠశాలకు రోబోటిక్స్ కిట్స్ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం ఎల్ ఎఫ్ టి, సి ఎస్ ఆర్ సంయుక్తంగా నిర్వహించాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మూల రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయుడు డి విశ్వమోహన్, నైపుణ్యత కలిగిన విద్యార్థులు 8వ తరగతి 9వ తరగతి చదువుతున్న 43 జట్లుగా ఏర్పడి 129 మంది విద్యార్థులు 21 కృత్యాలను, ఒక రోజంతా రమ్య బృందం చే హాండ్ అండ్ ట్రైనింగ్ పొందారు.

ఎమ్మెల్యే జీతాలు ఆపని ప్రభుత్వం..

విద్యార్థుల స్కాలర్‌షిప్ ఎందుకు ఆపింది..?

- పేద, మధ్యతరగతి విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర
- పెండింగ్‌లో ఉన్న రూ.8300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫీజు దీక్ష.. మద్దతు తెలిపిన పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

'ఎమ్మెల్యేల జీతాలు ఆపలేని రాష్ట్ర ప్రభుత్వం.. మరి విద్యార్థుల స్కాలర్ షిప్‌ను ఎందుకు పెండింగ్‌లో పెట్టింది. రూ.8300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్‌లో పెట్టడం అంటే పేద, మధ్యతరగతి విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయడమే అవుతుందని' ఎస్ఎఫ్ఐ నాయకులు మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ కమిటీ మేరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో మంగళవారం ఫీజు దీక్ష చేపట్టారు.

ప్రముఖ న్యాయవాది క్యాతం సిద్దిరాములు, టిపిటిఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు వేణుగోపాల్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కే చంద్రశేఖర్, సీఐటీయూ నాయకులు వెంకట్ గౌడ్ , తెలంగాణ రైతు సంఘం నాయకులు మోతి రామ్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొత్త నరసింహులు ఈ దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ విద్యార్థులకు ప్రభుత్వం స్కాలర్‌షిప్‌ను విడుదల చేయలేకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సుమారు రాష్ట్రంలో 8300 కోట్ల రూపాయలు స్కాలర్షిప్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను ప్రభుత్వం చెల్లించలేకపోవడం వల్ల విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కాలేజీల చుట్టూ తిరిగి అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కళాశాల యాజమాన్యాలు సైతం నిధుల లేక కళాశాలను నడుపుకోలేని పరిస్థితి వచ్చిందని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. ఈ దీక్షలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముదాం అరుణ్, ఎస్ అజయ్, జిల్లా నాయకులు మణికంఠ, సమీర్, రాహుల్, నితిన్, సాయి, నవీన్, శివతేజ, సాయి, ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ ఫీజు దీక్షకు పలువురి మద్దతు

సీఎంఆర్ బకాయిలు చెల్లించకుంటే చర్యలు

- ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేసి గోదామ్‌కు తరలిస్తాం
- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-బోధన్

రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి సీఎంఆర్ బకాయిలు చెల్లించకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుని రికవరీ చేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో బోధన్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిల్లర్ల నుంచి బకాయిలు రాబట్టడానికి తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మిల్లర్లకు ప్రభుత్వం ఆయాచితంగా దోచిపెట్టిందని అన్నారు. వారి నుంచి బకాయిలు తప్పనిసరిగా వసూలు చేస్తామన్నారు. ప్రభుత్వమే ధాన్యం నేరుగా కొనుగోలు చేసి గోదాములలో నిల్వ చేయడానికి ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. అందువల్ల ప్రస్తుత కొనుగోలు కేంద్రాలు ఆలస్యం అయ్యాయని అన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజలను కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ సంధ్య దామోదర్, బోధన్ మున్సిపల్ చైర్మెన్ పద్మావతి శరత్‌రెడ్డి, సొసైటీ చైర్మెన్ ఉద్మీర్ లక్ష్మణ్, డిసిసిబి డైరెక్టర్ శరత్, పిసిసి డెలిగేట్ గంగా శంకర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శంకర్, మార్కెటింగ్ చైర్మెన్ రామ్నాథ్ రావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మొయినుద్దీన్, నాయకులు పులి శ్రీనివాస్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి తూకం వేస్తున్న సుదర్శన్‌రెడ్డి

ఎస్ఎస్ఆర్ ముసాయిదా ఓటరు జాబితా ప్రకటన

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి

స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 కు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితాను మంగళవారం ప్రకటించినట్టు ఇరు జిల్లాల కలెక్టర్‌లు రాజీవ్‌గాంధీ హనుమంతు, ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎస్.ఎస్.ఆర్. ముసాయిదా ఓటరు జాబితా మంగళవారం ప్రకటించామని, అట్టి జాబితాలో అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే 28 నవంబరు 2024 లోగా సమర్పించవచ్చని, అట్టి వాటిని పరిశీలించి సంబంధిత అధికారులు డి చేస్తారని తెలిపారు.

నవంబరు 9, 10 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. వాటిలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి డిసెంబర్ 24 తేదీలోగా డిస్పోజల్ చేయనున్నట్టు తెలిపారు. జనవరి 6, 2025 రోజున ఫైనల్ పబ్లికేషన్ ప్రకటించనున్నట్టు తెలిపారు. జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరి పేరు ఓటరుగా నమోదు చేయవచ్చని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా

బాధ్యతలు స్వీకరించిన దిలీప్ కుమార్



దిలీప్‌కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ మున్సిపల్ కారోపరేషన్ కమిషనర్‌గా దిలీప్ కుమార్ మంగళవారం బాధ్యతలను మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో స్వీకరించారు. మేడ్చల్ జెడ్పీ సీఈవోగా పని చేసిన ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తిన సమాచారం అందించాలన్నారు. ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన దిలీప్ కుమార్‌కు డిప్యూటీ కమిషనర్ తో పాటు ఉద్యోగులు, సిబ్బంది స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

అనుకోకుండా జరిగింది..

కామారెడ్డి కలెక్టరేట్ నుంచి సీపీఐ(ఎం) నాయకులకు ఫోన్

స్వయంగా వినతిపత్రం స్వీకరించిన కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజా వాణిలో వినతుల స్వీకరణ సందర్భంగా కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వి సాంగ్వాన్ వివక్ష చూపారని సీపీఐ(ఎం) నాయకులు కలెక్టరేట్‌లోని డోర్‌కు వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో నవతెలంగాణ ప్రధాన సంచికలో 'కలెక్టర్ గారూ.. ఇదేం తీరు' శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుంచి సీపీఐ(ఎం) నాయకులకు ఫోన్ వచ్చింది. దీంతో సదరు పార్టీ నాయకులు వినతిపత్రం తీసుకొని వెళ్లారు. నాయకులను కలెక్టర్ నేరుగా తన చాంబర్‌కు పిలుపించుకొని మాట్లాడారు.



వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్

వివరాలు మెయిన్‌లో..

బాబ్లీ గేట్లు మూసివేత

సుప్రీం తీర్పు నేపథ్యంలో

జూలై 1 నుంచి అక్టోబర్ 29 వరకు ఓపెన్

నవతెలంగాణ-మెండోరా

ఎస్సారెస్పీకి ఎగువ భాగంలో గోదావరి నదిపై మహారాష్ట్రలో ఉన్న బాబ్లీగేట్ ప్రాజెక్టు గేట్లను మంగళ వారం మూసివేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతేడాది వర్షాకాలం సీజన్ ప్రారంభమయ్యే జూలై 1వ తేదీనా ప్రాజెక్టు గేట్లు తెరిచి.. సీజన్ ముగిసిన అనంతరం అక్టోబర్ 29న మూసివేయాల్సి ఉంటుంది. దీంట్లో భాగంగా బాబ్లీ ప్రాజెక్టు 14 గేట్లు సిడబ్ల్యూసి కమిటీ సమక్షంలో మూసివేసినట్లు ఎస్సారెస్పీ డిఈఈ గణేష్ తెలిపారు.



బాబ్లీప్రాజెక్టు గేట్లు మూసివేత

వివరాలు మెయిన్‌లో..

ఉమ్మడి జిల్లాల హాకీ ఎంపికలు


ఎంపికైన్న హాకీ క్రీడాకారులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మినీ స్టేడియంలో జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 17 బాలబాలికల జిల్లా హాకీ సెలక్షన్స్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి, వచ్చే నెల 1న కామారెడ్డి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల యూ/17 బాలురు, బాలికల సెలక్షన్స్‌కు ఈ జట్టు ఎంపిక చేసినట్టు తెలిపారు. ఎంపికైన జట్టు నవంబర్ 1న జరగబోయే ఉమ్మడి జిల్లాల ఎంపికకు వెళ్లనున్నట్టు పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియలో ఫిజికల్ డైరెక్టర్లు సదమస్తుల రమణ, పింజ సురేందర్, డి.చిన్నయ్య, డాక్టర్ స్వామి, నాగేష్, టీ.జి పేట అధ్యక్షులు బి.గోపిరెడ్డి, పీఈటీలు శ్రీకాంత్, సీనియర్ హాకీ క్రీడాకారిణి రాణి, ఉపాధ్యాయులు ఆకుల గంగాధర్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును మండల పరిధిలోని కిసాన్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకులు మంగళవారం లబ్ధిదారునికి అందజేశారు. కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో చెక్కును మంజూరు చేయించినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చాట్ల నరేష్, సి.నగేష్, గంగాధర్, రాజలింగం, అక్బర్, బూపి తదితరులు పాల్గొన్నారు.

దూస్‌గాం గ్రామ పంచాయతీకి శవ పేటిక అందజేత


శవపేటికను అందజేస్తున్న సూర్య యూత్ సభ్యులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సూర్య యూత్ ఆధ్వర్యంలో (కూలింగ్ శవపేటికను) గ్రామ పంచాయతీకి మంగళవారం బహుకరించారు. గ్రామంలో ఎవరికి అవసరం ఉన్నా గ్రామ పంచాయతీలో ఉన్న శవపేటికను సద్వినియోగం చేసుకోవాలని యూత్ సభ్యులు కోరారు. సూర్య యూత్ సభ్యులు మంచి ఆలోచన చేసి సహృదయం చాటుకున్నారని గ్రామస్తులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సూర్య యూత్ అధ్యక్షులు కొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గద్దె సత్యనారాయణ, ఉపాధ్యక్షులు తోకల సాయిలు, కోశాధికారి గంటేపల్లి రాజు, సలహాదారు దుర్గేష్, రవిగౌడ్, యూత్ సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి వినయ్ కుమార్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పి.సాయిలు, రాయ లింగయ్య, దుర్గేష్, సాకలి అబ్బన్న, గంటేపల్లి లక్ష్మన్, గుడిసె భూషణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి

- ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి


కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన్న సహకార సంఘం అధ్యక్షులు

నవతెలంగాణ-ఎడపల్లి

రైతుల పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి అధిక లాభాలు పొందాలని ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి అన్నారు. ఎడపల్లి సహకార సంఘం పరిధిలో గల ఎడపల్లి, కుర్నాపల్లి, తానాకలాన్, వడ్డేపల్లి, కుర్నాపల్లి గ్రామాలలో ఆయన మంగళవారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మంగళ్‌పాడ్ డైరెక్టర్ చేపూర్ నగేష్ గౌడ్, కుర్నాపల్లిలో సహకార సంఘం ఉపాధ్యక్షులు అనిల్‌రెడ్డి, సహకార సంఘం పాలకవర్గం సభ్యులు, సహకార సంఘం కార్యదర్శి రాజారాం, ప్రభాకర్ గౌడ్, జగన్, సురేష్, రైతులు భూప గంగాధర్, అరుగుల నాగరాజ్, తాటి సంతోష్‌గౌడ్, దెగ్లూరు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

గడుగు గంగాధర్‌కు సన్మానం



గంగాధర్‌ను సన్మానిస్తున్న బార్ కౌన్సిల్ సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడుగా నియమితులైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, న్యాయవాది గడుగు గంగాధర్‌ను బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గడుగు గంగాధర్ జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాలను మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆశ నారాయణ, మధుసూదన్‌రావు, రాజ్‌కుమార్ సుబేదార్ తదితరులు పాల్గొన్నారు.

గడుగు గంగాధర్‌ను సన్మానించిన బార్ అసోసియేషన్..

ఇటీవల తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులుగా నియమితులైన నిజామాబాద్ నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది గడుగు గంగాధర్‌ను నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో అనేక పదవులు అధిరోహించాలని, ఉన్నత స్థాయిలో వెళ్లాలని రాష్ట్ర రైతాంగానికి సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొంపల్ సురేష్, పిల్లి శ్రీకాంత్, కిరణ్ కుమార్ గౌడ్, నరేందర్‌రెడ్డి, బిట్ల రవి, నారాయణ, ఉదయ్ కృష్ణ, గణేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల ఫీజు నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ బీఏ, బీకాం, బిఎస్సి, బిబిఏ కోర్సుల మూడవ, ఐదవ సెమిస్టర్ (రెగ్యులర్), రెండవ, నాల్గవ, ఆరవ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ 2020-23 బ్యాచ్ విద్యార్థులకు థియరీ ఎగ్జామ్స్ కోసం నవంబర్ 2024లో హాజరయ్యే విద్యార్థులందరూ పరీక్ష ఫీజు చెల్లించడానికి చివరి తేదీ 04 నవంబర్ వరకు, రూ.100 అపరాధ రుసుముతో నవంబర్ 05 వరకు చెల్లించాలని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలు తెలంగాణ వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు కంట్రోలర్ పేర్కొన్నారు.

హడలెత్తిస్తున్న కోతులు

- గుంపులుగా సంచరిస్తున్న వైనం
- దాడిచేసి గాయపరుస్తుండటంతో భయాందోళన

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కోతుల బెడద రోజురోజుకు పెరుగుతోంది. కోతులు విపరీతమై గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను గాయపరుస్తూ హడలెత్తిస్తున్నాయి. స్కూలు పిల్లలు, రైతులు, జనాలు, కూలీలు రోజువారీ పనుల్లోకి వెళ్లాలంటే భయం భయంగా వెళుతున్నారు. కోతులు పిల్లలపై, పెద్దలపై, వృద్ధులపై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. వీటి గాయాలకు గురైన ప్రజలు మూడు రోజులకోసారి టీకాలు తీసుకోవడానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల చుట్టూ తిరుగుతూ భుజాల నొప్పుల వాపులతో బాధపడుతున్నారు. అధికారులు స్పందించి కోతుల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


గుంపులుగా సంచరిస్తున్న కోతులు

అనుమతులు లేకుండా టపాకాయలు అమ్మొద్దు

- ఇంచార్జ్ ఫైర్ ఆఫీసర్ బి.శేఖర్

నవతెలంగాణ-బాల్కొండ

దీపావళి పండుగ సందర్భంగా బాల్కొండ మండల ఫైర్ స్టేషన్ పరిధిలో టపాకాయల దుకాణం నిర్వహించే వ్యాపారులకు, అక్రమంగా కిరాణా షాపులలో, ఇతర ప్రాంతాలలో అమ్మకాలు నిర్వహించే వ్యాపారస్తులు అక్రమంగా అనధికారికంగా ఎటువంటి అనుమతులు లేకుండా టాపాకాయలు వీధులలో విక్రయించవద్దని, ఒకవేళ అలా అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇంచార్జ్ ఫైర్ ఆఫీసర్ బి.శేఖర్ హెచ్చరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో కిరాణా, ఇతర షాపులలో టపాకాయలు అమ్మడం ద్వారా ప్రమాదవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వారికి మాత్రమే నష్టం జరగకుండా వారి వల్ల ఇతరులకు ప్రాణ ఆస్తి నష్టం సంభవించే అవకాశముందని, ఈ విషయాన్ని గమనించి వ్యాపారస్తులు కిరణా షాపులలో టపాకాయలు విక్రయించవద్దని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

ప్రజలు టపాకాయలు కాల్చే సమయంలో చిన్న పిల్లలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నివాస ప్రాంతాలలో, వ్యవసాయ క్షేత్రాలకు దగ్గరగా, పూరి గుడిసెలకు దగ్గరగా టపాకాయలు కాల్చవద్దని అన్నారు. వాటి ద్వారా అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. టపాకాయలు కాల్చేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని, ఐఎస్ఐ లేబుల్ ఉన్న టపాకాయలు మాత్రమే కాల్చాలని అన్నారు. తల్లిదండ్రులు పెద్దలు చిన్నపిల్లలకు టపా కాయలు, అగ్గిపెట్టెలు ఇవ్వవద్దని సూచి ంచారు. చిన్న పిల్లలు టపాకాయలు కాల్చే సమయంలో పెద్దలు ఆధ్వర్యంలో కాల్చే విధంగా చూసుకోవాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వ్యాపారస్తులు టపాకాయలు అమ్మడానికి ప్రత్యేకమైన అనుమతులు పొందాలని, ఇతర ఏదైనా అగ్ని ప్రమాద వార్త తెలియజేయడానికి, లేదా ఏదైనా సందేహాలకు బాల్కొండ ఇన్చార్జ్ ఫైర్ ఆఫీసర్ బి.శేఖర్ 87126 85798 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.



బీసీ కులాల జనాభా దామాషా ప్రకారం

చట్టసభల్లో రిజర్వేషన్ అమలు చేయాలి

- బిఎల్‌ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ సమాజంలో 93శాతం ఉన్న బిసి ఎస్సీ ఎస్టీ మత మైనారిటీలు అగ్రకులపేదలైన బహుజన ప్రజలకు జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో సమాన వాటా పంపిణీ చేయాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బిఎల్‌ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రోడ్లు, భవనాల అతిథి గృహంలో నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లా బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బిఎల్‌ఎఫ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల జనగణనతో బిసి కులాల జనాభా దామాషా ప్రకారం పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో ప్రాతినిధ్యం లేని కొన్ని బిసి కులాలు ఎస్సీ, ఎస్టీల కంటే రాజకీయ, ఆర్థిక, సామాజిక సాంస్కృతికంగా అత్యంత వెనుకబాటు తనాన్ని అనుభవిస్తున్నారని దానికి కారణం ఇప్పటి వరకు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, బిజెపి, బీఆర్ఎస్, టిడిపి, వైసిపి తదితర ఆధిపత్య రాజకీయ పార్టీలేనని విమర్శించారు. బిఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్‌లు దండి వెంకట్, వనం సుధాకర్, రాష్ట్ర నాయకులు ఎస్.సిద్దిరాములు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం సంవత్సరానికి 20వేల కోట్ల రూపాయలు, ఐదు సంవత్సరాలకు గాను లక్ష కోట్ల రూపాయలను బిసి కులాల అర్థికాభివృద్ధి కోసం కేటాయి స్తామని, ప్రభుత్వ వివిధ కాంట్రాక్ట్ పనుల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని వాగ్దానం చేశారని తెలిపారు. అదేవిధంగా కుల జనగణన ద్వారా బిసి కులాలకు అసెంబ్లీ, పార్లమెంట్ లాంటి చట్టసభలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌ఎఫ్ రాష్ట్ర నాయకురాలు సబ్బని లత, మేత్రి రాజశేఖర్, మారోజు సునీల్ కుమార్, బిఎల్‌ఎఫ్ నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లా నాయకులు కె.శ్రీనివాస్, వడ్ల సాయికృష్ణ, జబ్బార్ నాయక్, దండు జ్యోతి, నాగారపు ఎల్లయ్య, బి.జగదీష్, మోషిన్, చంద్ర గౌడ్, జి.శ్రీమాన్, ఎస్.డి.సయ్యద్ తదితరులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న బిఎల్‌ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్

అభయపై లైంగికదాడి చేసి చంపిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి

- ఐఎఫ్‌టీయూ నిజామాబాద్ నగర కార్యదర్శి ఎం.శివకుమార్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కలకత్తాలో జూనియర్ డాక్టర్ అభయపై లైంగికదాడి చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐఎఫ్‌టీయూ నిజామాబాద్ నగర కార్యదర్శి ఎం.శివకుమార్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టియు జాతీయ కమిటీ పిలుపు మేరకు నిజామాబాద్ నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్వతంత్ర భారతదేశంలో మహిళలు ఉన్నత విద్య కోసం నగరాలకు వెళ్లి చదివే పరిస్థితి లేకుండా భయానిక వాతావరణాన్ని దుర్మార్గులు సృష్టిస్తున్నారని ఆయన అన్నారు. జూనియర్ డాక్టర్ అభయ ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎం.శివకుమార్ డిమాండ్ చేశారు. కలకత్తాలాంటి పట్టణంలో ఒక ఉన్నత విద్యను అభ్యసించే మహిళలకే రక్షణ లేకపోతే ఇక దేశంలో సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాతృదేవోభవ అంటూ మాతృమూర్తి లాంటి అభయను అంతం చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించి, మరోసారి ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు. అశ్లీల సాహిత్యం, బూతు సినిమాలను నిషేధించి యువతను తప్పుడు ఆలోచనల ప్రభావం నుంచి పాలకులు కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళా ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ ఈ విషయంలో కఠినంగా నిర్ణయం తీసుకొని, మహిళల జోలికి రాకుండా తగుచర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఐఎఫ్‌టీయూ నగర కార్యదర్శి మాట్లాడుతూ.. చట్టాలలో ఉన్న లొసుగుల వల్ల నేరస్తులు తప్పించుకుంటున్నారని, కేంద్ర ప్రభుత్వంలో ఉన్న కొందరి అండదండలు ఇలాంటి వారికి అందుతున్నాయని, అది విచారకరమని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు మచ్చ మోహన్, మొగులయ్య, రాజు, వరదయ్య, వీరయ్య, శంకర్, రాజు, గంగాధర్, సోను, అంజయ్య, మల్లేష్, వసీం, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

బీసీ కమిషన్ చైర్మన్ సభ్యులకు హారతులతో స్వాగతం

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీసీల సమస్యలు తెలుసుకోవడానికి నిజామాబాద్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు వచ్చిన బీసీ కమిషన్ చైర్మన్ సభ్యులకు మంగళవారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఘనస్వాగతం పలికారు. వారికి జిల్లా బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు శ్రీలత హారతులతో స్వాగతం పలికారు. స్వాతంత్ర్యం రాకముందు బ్రిటీష్ హయంలో జరిగిన బీసీ కులగణన ఇప్పటి వరకు మళ్లీ కులగణన జరగకపోవడం చాలా బాధాకరమని తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వం బీసీ కులగణన చెయ్యడానికి ముందుకు రావడం హర్షనీయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ అన్నారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను, సభ్యులు సురేందర్, జయప్రకాశ్, బాలలక్ష్మిని కలిసి బీసీల సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో బుస్స ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, పోల్కం గంగాకిషన్, దర్శనం దేవేందర్, కరిపే రవిందర్, భూమన్న, కొయ్యాడ శంకర్, నారాయణరెడ్డి, శ్రీలత, హనుమంత్‌రావు, చంద్రకాంత్, లక్ష్మీనారాయణరాజు, సుదర్శన్, సాయి బసవ, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.


స్వాగతం పలికిన నాయకులు

అనారోగ్యంతో మున్సిపల్ కార్మికుడు మృతి

నవతెలంగాణ-బోధన్

బోధన్ మున్సిపాలిటీలో వాటర్ వర్క్ విభాగంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుడు పెద్దింటి గంగారాం మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి సమాచారం తెలిసిన పలువురు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.



గోల్డ్ మెడల్స్ సాధించిన యువకుడికి సన్మానించిన ఎమ్మెల్యే


యువకుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి జెస్సు ప్రవంతి శ్రీనివాస్ కుమారుడైన జెస్సు వెంకట్ (20) జాతీయస్థాయిలో వరల్డ్ పవర్ లిఫ్టింగ్ కాంగ్రెస్ (డబ్ల్యూపీసీ) హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ పోటీలో బెంజ్ ప్రెస్ 120 కిలోల జూనియర్ సంబంధించిన వెయిట్ లిఫ్టింగ్‌లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని రెండు బంగారు పతకాలను సాధించడంతో ఎమ్మెల్యే మంగవారం ఘనంగా శాలువాతో సన్మానం చేసి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో జెస్సు అనిల్ కుమార్, పులి యుగంధర్, పట్టణ ఉపాధ్యక్షులు దోండి ప్రకాష్, ఓబిసి మోర్చా పట్టణ అధ్యక్షులు బాసెట్టి రాజ్‌కుమార్, బీజేవైఎం మండల అధ్యక్షులు నరేష్‌చారి, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి ఉదయ్‌గౌడ్, ఓబీసీ మోర్చా పట్టణ ఉపాధ్యక్షులు రెడ్డబోయిన దక్షిణ మూర్తి, కార్యదర్శి బట్టు రాము, జుగ్గె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో అవసరమైన పుస్తకాలను అందజేస్తా


గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను సన్మానిస్తున్న ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామంలో మాజీ సర్పంచ్ పానుగంటి రూపా సతీష్‌రెడ్డి సొంతంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో అవసరమైన పుస్తకాలను అందజేస్తానని గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డి హామీ ఇచ్చారు. ఇటీవల నూతనంగా నియమితులైన నిజామాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డిని ఆర్మూర్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి గ్రామంలో సొంత నిధులతో మాజీ సర్పంచ్ రూపాసతీష్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని త్వరలో సందర్శించి ప్రస్తుతం గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు కాకుండా ఇతర అవసరమైన పుస్తకాలు అందజేస్తానని హామీ ఇచ్చినట్లు వినోద్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా కిసాన్ కెత్ ఉపాధ్యక్షుడు యెండల కిషన్, జిల్లా రెడ్డి ఐక్యవేదిక అధ్యక్షుడు విజయ్‌పాల్ రెడ్డి పాల్గొన్నారు.

టీజీపీఎస్పీ కానిస్టేబుల్స్ డిస్మిస్, సస్పెండ్‌ను ఎత్తివేసి మళ్ళీ విధుల్లోకి తీసుకోవాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



టీజీపీఎస్పీ కానిస్టేబుల్స్ డిస్మిస్, సస్పెండ్‌ను ఎత్తివేసి మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. గత కొద్ది రోజులుగా టిజీఎస్పి కానిస్టేబుల్స్ చేస్తున్న నిరసనలపై ఆయన స్పందించి మంగళవారం మాట్లాడారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసులు రోడ్డెక్కి ధర్నాలకు దిగితే వారి మానసిక క్షోభ అర్థ చేసుకునేది పోయి ప్రభుత్వం వారిపై కక్ష సాధింపు చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. పునర్విభజన వల్ల తమకు అన్యాయం జరుగుతుందని కుటుంబాలకు దూరమవుతున్నామని వారి భార్య పిల్లలు రోడ్డెక్కితే వారి వ్యక్తిగత జీవితాలను అర్థం చేసుకోకుండా 39 మంది కానిస్టేబుల్స్‌ను సస్పెండ్ చేయడం, 10 మందిని డిస్మిస్ చేయడం అన్యాయమని తెలిపారు. దీనిని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టిజీఎస్పి కానిస్టేబుల్స్ న్యాయపరమైన డిమాండ్స్‌ను పరిగణలోకి తీసుకొని వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే సస్పెండ్ చేసిన 39మందిని అలాగే డిస్మిస్ చేసిన 10 మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లయోల హైస్కూల్ ప్రిన్సిపాల్

నవతెలంగాణ-బోధన్

విద్యార్థులు విద్యతో పాటు జీవన నైపుణ్యాలపై అవగాహన కలిగి ఉండాలని లయోల హైస్కూల్ ప్రిన్సిపాల్ సురేష్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని లయోల హైస్కూల్‌లో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్య జీవితంలో చేపట్టే కార్యక్రమాలు, రకరకాల వంటలు తయారు చేయడంపై విద్యార్థులకు వివరించారు. అలాగే పూల దండలు స్వయంగా తయారుచేసేలా తర్ఫీదునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి శంకర్, గంగామణి, ఉపాధ్యాయులు అనిత, మీనాక్షి, పద్మ, లావణ్య, రేఖ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సంతలో సమస్యలు తీర్చాలి

నవతెలంగాణ-భిక్కనూర్

వారాంతపు సంతలో కూరగాయలు విక్రయించడానికి వస్తున్న మహిళలకు మూత్రశాలలో లేనందున ఇబ్బందులు పడుతున్నారని మండల భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు తెలిపారు. అదే విధంగా ధాన్యం కొనుగోలు చేయని కారణంగా రోడ్డుపైనే ఉంచాల్సి వస్తుందని ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యాన్ని కొనుగోలు చేసి 48 గంటల్లో ధాన్యం డబ్బులు చెల్లించాలని తెలిపారు. మండల భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో, మార్కెట్ కమిటీ కార్యాలయాలలో సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం అందజేశారు. అనంతరం సంఘ్ మండల అధ్యక్షులు మల్లారెడ్డి మాట్లాడుతూ హమాలీ కూలీలు ప్రభుత్వమే కూలీ చెల్లించాలని, తూకం వేసిన తర్వాత రైతుకు ఎలాంటి బాధ్యత లేకుండా చూడాలని, ధాన్యం ఆరబెట్టే సమయంలో, తూకం వేస్తున్న చోట అన్ని సౌకర్యాలు కల్పించాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కుంటయ్య, సంఘం సభ్యులు, తదితరులు ఉన్నారు.

మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్‌కు పరామర్శ

నవతెలంగాణ-రామారెడ్డి



పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మండల కేంద్రానికి చెందిన మాజీ రైతుబంధు అధ్యక్షులు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భానురి రాజిరెడ్డి అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొంది, ఇంటి వద్ద కూడా చికిత్స పొందుతూ ఉండటంతో, మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటికి వెళ్లి పరామర్శించి, బాధితుడికి, కుటుంబానికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి, గాంధారి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు సత్యం రావు, ఉమ్మడి ఎస్ఎస్ నగర్ మాజీ జెడ్పిటిసి పడిగెల రాజేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు సతీష్ గుప్తా, పడగల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏటీసీ కోర్సుల్లో సీట్ల భర్తీ సకాలంలో పూర్తిచేయాలి

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నవతెలంగాణ-బిచ్కుంద



మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

బిచ్కుంద ఐటిఐ కళాశాలలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ద్వారా ఉపాధి కల్పన లభిస్తుందని, ఏటీసీలో ఆరు కోర్సుల సీట్ల భర్తీ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు అన్నారు. మంగళవారం మండలంలోని దడ్గీ చౌరస్తాలో గల ఐటిఐ కళాశాలను సందర్శించి అడ్వాన్స్ టెక్నాలజీ నూతన భవన పనులను అడ్మిషన్ల ప్రక్రియ, ఏటీసీ పరికరాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లో అడ్మిషన్లు పొందిన వారు కోర్సులు పూర్తి చేసిన తర్వాత టాటా కంపెనీ ద్వారా ఉద్యోగ ఉపాధి లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అడ్మిషన్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సూచించారు. ఒక 172 సీట్లకు గాను 160 సీట్లు భర్తీ అయ్యాయని త్వరలో వంద శాతం సీట్లు భర్తీ చేయడం జరుగుతుందని ప్రిన్సిపల్ ప్రమోద్ వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఆర్ఐ రవిందర్, నాయకులు విఠల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దర్పల్ గంగాధర్, అధికారులు, నాయకులు, ప్రజలు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-మద్నూర్



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలో దాదాపు 165 మంది లబ్ధిదారులకు మంజూరైన ఆర్థిక సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మంగళవారం పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ మండల్ నాయకులు ధరస్ సాయిలు, శక్కర్గ రమ్ పటేల్, చౌలావార్ హనుమాన్లు స్వామి, యువ నాయకులు బాలు యాదవ్, దేవి దాస్ పటేల్, మాధవరావు పటేల్, ఉమ్మడి మండలానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

కాగా మద్నూర్‌కు చెందిన లబ్ధిదారులు లబ్ధిదారులు యోగేష్ గోల్డ్ షాప్ రూ.60000, బొగుల్వార్ బోజ్ రూ.30000 చెక్కును మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు రామ్ పటేల్, హనుమాన్లు స్వామి, అమూల్, జావీద్ పటేల్, రాజు, సంతోష్, తదితరులు పంపిణీ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేట గ్రామానికి చెందిన బొర్రా బాలరాజ్ అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నదని తెలుసుకున్న నా రెడ్డి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్‌రెడ్డి మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘోత్తమరెడ్డి, బండి ప్రవీణ్, చింతకుంట కిషన్, ఆంజనేయులు, రంజిత్, మహేష్, విజయ్, శ్రీకాంత్, రాజు, గర్గుల్ రంజిత్, కొయ్యల శేఖర్, బద్ది సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పిట్లం గ్రామపంచాయతీ సెక్రటరీగా బలరాం



బలరాంను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్ర గ్రామపంచాయతీ నూతన సెక్రెటరీగా బలరాం మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో మండలంలోని చిన్న కొడప్‌గల్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించి జుక్కల్ గ్రామపంచాయతీ కార్యాలయంకు బదిలీపై వెళ్లారు. అనంతరం మళ్లీ మండల కేంద్రా గ్రామపంచాయతీ కార్యాలయంకు బదిలీపై రావడం గొప్ప విశేషం కాగా బదిలీపై వచ్చిన నూతన సెక్రటరీకి పంచాయతీ సిబ్బంది శాలువాతో సత్కరించి స్వాగతించారు. ఇక్కడ పంచాయతీ సెక్రెటరీగా విధులు నిర్వహించిన యాదగిరి జుక్కల్ గ్రామపంచాయతీ సెక్రెటరీగా బదిలీపై వెళ్లారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు జూనియర్ అసిస్టెంట్, మనోజ్ బిల్ కలెక్టర్, అంకం శ్రీను, చెవుల శ్రీనివాస్, శేవాజ్ కంప్యూటర్ ఆపరేటర్, ప్రవీణ్, బసంత్, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ (రెవిన్యూ)గా విక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి



అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్ పదవీ బాధ్యతలు మంగళవారం స్వీకరించారు. తొలుత జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డి.శ్రీనివాస్ రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంను అందజేశారు.

స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ఏబీవీపీ ర్యాలీ

నవతెలంగాణ-కామారెడ్డి

స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ రోహిత్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రూ.7800 కోట్ల స్కాలర్‌షిప్ ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌ంట్ బకాయిలు విడుదల కాలేదని రాష్ట్ర ప్రభుత్వం దాన్ని విడుదల చేయని యెడల ఉద్యమం ఉధ్రితం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఖలీల్, కార్యకర్తలు వెంకటేష్, రాజు, నవీన్, మానస, శివ, రాకేష్, విద్యార్థులు, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పోసానిపేట విద్యార్థి

నవతెలంగాణ-రామారెడ్డి



68వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు మండలంలోని పోసానిపేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పోతుల సుశ్వంత్‌రెడ్డి 9వ తరగతి ఎంపికైనట్లు మంగళవారం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. గ్రామస్తులు సుశ్వంత్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్ రెడ్డిని అభినందించారు. వచ్చేనెల 7న యాదాద్రి, భువనగిరి జిల్లాలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-భిక్కనూర్



గాయపడ్డ డీసీఎం డ్రైవర్

మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజా సమీపంలో తెల్లవారుజామున రెండు వాహనాలు ఢీకొనగా వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాదు నుండి నాగపూర్ వైపు వెళ్తున్న డీసీఎం ముందు వెళ్తున్న లారీని ఢీకొనగా డీసీఎం డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ డీసీఎంలో ఇరుక్కుపోవడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని టోల్ ప్లాజా సిబ్బంది సహాయంతో డ్రైవర్‌ని సురక్షితంగా బయటకు తీసి 108 లో కామారెడ్డి ఏరియా హాస్పిటల్ తరలించారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బస్వాపూర్ గ్రామంలో సొసైటీ చైర్మన్‌గా మద్ది స్వామి పదవి బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. మంగళవారం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గంప గోవర్ధన్ సొసైటీ చైర్మన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అంతకుముందు సొసైటీ పర్సన్ ఇంచార్జ్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించిన వారిని తొలగించి పాలకవర్గం కొనసాగించాలని హైకోర్టు నోటీసు ఇవ్వడంతో పాలకవర్గంలోని వైస్ చైర్మన్ స్వామి సొసైటీ చైర్మన్ గా నియమించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

గొల్లపల్లిలో పశు వైద్య శిబిరం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గొల్లపల్లిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ,పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోష వ్యాధుల చికిత్స శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సంఘ్యా నాయక్ ,వైస్ చైర్మన్ రాజిరెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. మండల పశు వైద్యాధికారి డా. రామ్ చందర్ పాడి పశువులకు చూడి పరీక్షలు నిర్వహించి, గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు చికిత్సలు నిర్వహించారు. ఎదలో ఉన్న పశువులకు కృత్రిమ గర్భధారణ నిర్వహించారు. దూడలకు నట్టల మందులు, పాడి పశువులకు మినిరల్ మిక్చర్ ప్యాకెట్లు అందజేశారు. శిబిరంలో 50 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు , . 22 సాధారణ చికిత్సలు, 32 పశువులకు నట్టల నివారణ మందులు అందజేశారు. పాడి రైతులకు పాడి పశువుల యాజమాన్య పద్ధతులు, దూడల పోషణ, కృత్రిమ గర్భధారణ ప్రాముఖ్యత, సెక్స్ సార్టెడ్ సెమెన్ (ఖచ్చితంగా ఆడదూడ పుట్టే విధంగా అభివృద్ధి పరిచిన వీర్య నాళికలు) తదితర అంశాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి గంగు, డైరెక్టర్లు, శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు లక్ష్మగౌడ్,ప్రవీణ్ గౌడ్, నారాయణ, రమేష్, సిబ్బంది ఆంజనేయులు, బలమణి, గోపాలమిత్ర హారిక, మైత్రి దశరథ్, పాడి రైతులు పాల్గొన్నారు.

స్కూల్ విద్యార్థులకు బూట్లు పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ఉన్న 3 ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి తన సొంత డబ్బులతో 150 మంది విద్యార్థులకు 45వేల రూపాయల ఖర్చుచేసి బూట్లు, సాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ధర్మయ్య, విడిసి అధ్యక్షులు సిద్ధ రాములు, ఆలయ చైర్మన్ భూమయ్య, నాయకులు లింగారెడ్డి, మహేష్, కిషన్, నర్సారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు, గ్రామస్తులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాల పరమర్శ

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని రాంపూర్, మద్దెల చెర్వు గ్రామాల కాంగ్రెస్ పార్టీ బాధిత కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రాంపూర్ గ్రామానికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బలరాంరెడ్డి పితృమూర్తి కిష్టారెడ్డి, మద్దెల చెరువు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగారాం మాతృమూర్తి రాజ బోయిన గంగవ్వ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. తమకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డిసిసి డెలిగేట్ కృష్ణారెడ్డి దొర, మాజీ ఎంపీటీసీ సభ్యులు మురళీధర్ గౌడ్, హిమ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమికి హద్దులు పాతిన అధికారులు



హద్దులు పాతుతున్న దేవాలయ అధికారులు

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని ఆంజనేయ స్వామి మారుతీ మందిరం సలాబత్పూర్ ఆలయానికి గ్రామానికి చెందిన మాజీ పట్వారి శంకర్రావు తన సొంత రెండు ఎకరాల వ్యవసాయ భూమినీ ఆలయానికి గిఫ్ట్‌గా అందజేయడం జరిగింది భక్తుడు దేవాలయానికి అందజేసిన భూమిని సర్వే అధికారుల ద్వారా సర్వే నిర్వహించుకొని 2 ఏకరాల భూమికి హద్దులు పెట్టడం జరిగింది. ఆ భక్తుడు దేవాలయ అభివృద్ధి కోసం రెండు ఎకరాల భూమిని దానంగా స్వచ్ఛందంగా ఇవ్వడం పట్ల మద్నూర్ గ్రామ ప్రజలు ఆ మాజీ పట్వారి శంకర్రావుకు అభినందించడం జరిగింది.

జీవన ఎరువులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-సదాశివనగర్

జీవన ఎరువుల వాడే ఉపయోగవిదానం గురించి రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని పద్మాజివాడి గ్రామ రైతులకు జీవన ఎరువుల వాడే విదానం గురించి వివరించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు అవగాహన కల్పించారు. విద్యార్థినులు జి.హారిక, ఎస్.మంజుల, టి.ఎల్.వసంత ,సి.యచ్.ఈషా, టి.ప్రగతి, ఈకార్యక్రమంలో రైతులు లింగారెడ్డి, గంగారెడ్డి, సంతోష్ రెడ్డి, దత్తారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల ప్రక్షాళనే కామ్రేడ్ ఓంకార్‌కు నివాళి

నవతెలంగాణ-కామారెడ్డి



కామ్రేడ్ ఓంకార్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

కుల, మత ప్రాంతీయ తత్వాలతో ప్రజాలను మభ్య పెడుతున్న ప్రస్తుత రాజకీయాలను ప్రక్షాళన చేయడమే కామ్రేడ్ ఓంకార్‌కు నిజమైన నివాళి అని ఎంసిపిఐయు కేంద్ర కమిటీ సభ్యులు వనం సుధాకర్ అన్నరు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, మాజీ శాసనసభ్యులు, అమర జీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ 16వర్ధంతి సందర్భంగా "ప్రస్తుత రాజకీయాలు మార్క్సిజం అంబేద్కర్ ఆలోచన విధానం అనే అంశంపై అక్టోబర్ 17 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమం యంసిపిఐ(యు) కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య హాజరయ్యారు. దీర్ఘకాలం దేశాన్ని పాలించిన దోపిడి వర్గ,మతోన్మాద,అవినీతి ఆకాశవాద పార్టీలు రాజకీయాలను దిగజార్చినాయి అని ఆరోపించారు. ప్రజల ఓట్లతో గెలిచి చట్ట సభలను శాసించిన పార్టీలు ప్రజలకు అనుకూలమైన పాలన చేయకుండా దేశాన్ని రాష్ట్రాన్ని అభివృద్ధి పరచకుండా రాజకీయాలను కలుషితం చేస్తూ రాజకీయాలు అంటే ప్రజలు అసహ్యించుకునే పరిస్థితికి దిగజార్చారని తెలియజేశారు. కలుషితమైన ప్రస్తుత రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన ఏసి వర్గ కుల తత్వాలను నిర్మూలించడం తక్షణ రాజకీయ కర్తవ్యంగా భావించడమే ఓంకార్‌కి నిజమైన నివాళి అని ముగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జబ్బర్ నాయక్, జిల్లా కమిటీ సభ్యులు మైపాల్, సదానందం, రమేష్, రాజు, నరెష్, రాజమణి, సరుప, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు రూ.4016 జీవన భృతి ఇవ్వాలి

- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

నవతెలంగాణ-గాంధారి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

బీడీ కార్మికులకు 4016 జీవన భృతి ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కానీ బీడీ కార్మికులు అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని బీడీ ఫ్యాక్టరీలలో నెలకు ఐదు రోజుల నుంచి పది రోజుల వరకే పని ఇస్తున్నారని తెలిపారు. సగానికి సగం తగ్గించి ఇస్తున్నారన్నారు. ఉత్పత్తి పెంచడానికి కార్మికులకు చేతినిండా పని ఇవ్వాలని అనేక ఆందోళనలు చేసిన ఫలితం శూన్యం గానే వీడి ఫ్యాక్టరీ యజమానులు వారి స్వలాభం కోసం మాత్రమే పనిచేస్తున్నారన్నారు. కావున తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికలలో హామీలులో భాగంగా బీడీ కార్మికులకు నెలకు 4016 రూపాయలు చేయూత కింద ఇస్తామని అన్నారు. ఫిబ్రవరి 28-2014 కటాఫ్ తేదీని తొలగించి ఈ రంగంలో పని చేస్తున్న వీడి చుట్టే కార్మికులకు బట్టి వాళ్ళ ప్యాకింగ్ కమిషన్ దారులకు జాతీయ కంపెనీల పని చేస్తున్న ఉద్యోగులకు అందరికీ ఇవ్వవలసిందిగా కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రకాష్, వివిధ గ్రామాల నుంచి 200 మంది కార్మికులు పాల్గొన్నారు.

నగర వాటికను పరిశుభ్రంగా ఉంచాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



మాట్లాడుతున్న పలువురు

ఎల్లారెడ్డి పట్టణ ప్రజలకు సర్వే నంబర్ 1406 లో నిర్మిస్తున్న ఆహ్లాదకరమైన నగరవాటికను మంగళవారం మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ పరిశీలించారు. పట్టణ సమీపంలోని అటవీ ప్రాంతంలో నగరవాటికను ఏర్పాటు చేయాలని అటవీశాఖ నిర్ణయించింది. ఇందులో ప్రజలు వాకింగ్ తో పాటు ఆహ్లాదకరమైన ప్రశాంత వాతావరణంలో గడిపేందుకు అణువుగా లక్ష రూపాయల వ్యయంతో పనులు చేపట్టారని అన్నారు. ఇందులో కలుపు మొక్కలు పెరగడంతో వాటిని తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ ఏ ఈ వినోద్,కౌన్సిలర్లు నీలకంతం, అల్లం శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతి, పోచయ్య శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల రక్తదాన శిబిరం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాలలో భాగంగా మంగళవారం నాడు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్లో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఎల్లారెడ్డి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసులతోపాటు పలువురు యువకులు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. అనంతరం డిఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సిఐ రవీందర్ నాయక్, ఎస్ఐ మహేష్, సదాశివ నగర్ సిఐ సంతోష్, నాగిరెడ్డిపేట్ ఎస్సై మల్లారెడ్డి, లింగంపేట్ ఎస్సై అరుణ్, గాంధారి ఎస్సై ఆంజనేయులు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా, ఎల్లారెడ్డి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-నిజాంసాగర్

ఆస్పత్రుల్లో చికిత్స పొంది ఆర్థిక సాయం కోసం ఆర్జీ పెట్టుకున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసినట్టు కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మండల అధ్యక్షులు మల్లికార్జున్, రవీందర్ రెడ్డి తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని వారు అన్నారు. కార్యక్రమంలో యువత అధ్యక్షులు మల్లయ్య గారి ఆకాష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థను పెంచేందుకే తూకం ఆలస్యం

నవతెలంగాణ-బీబీపేట్

దళారీ వ్యవస్థను పెంచిపోషించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ధాన్యం తూకం ఆలస్యం చేస్తున్నారని జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్ కుమార్ ఆరోపించారు. బీబీపేట్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రేవంత్ రెడ్డి తాను రైతు నాయకుడిని అంటూ చెప్పుకునే ఓ మోసపూరిత మాట ఓ పక్క రైస్ మిల్ ఓనంకు రైస్ మిల్ యాజమాన్యానికి అండగా ఉండి పచ్చిధాన్యాన్ని 1900 రూపాయలకు రైతు నుండి దళారీ వ్యవస్థను పెంచి పోషించడానికి ఐదు కిలోల ధాన్యాన్ని ఒక క్వింటాలుకు కట్ చేయించి అన్నదాత కడుపు కొడుతున్నట్టు విమర్శించారు. వెంటనే ధాన్యం తూకం ప్రారంభించాలని, సన్నవడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ బాలమణి, బీఆర్ఎస్ మండల కార్యదర్శి సింగిల్ విండో డైరెక్టర్ దేవునిపల్లి శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బత్తిని జనార్ధన్, మాజీ ఎంపీటీసీ పంపరి శివరాజ్, మల్కాపూర్ గ్రామ అధ్యక్షుడు కక్కెర రాజేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



అన్వేష్‌రెడ్డిని కలిసిన సదాశివరెడ్డి

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్ అన్వేష్‌రెడ్డిని అడ్లూర్ ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ సదాశివరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ విత్తన ఉత్పత్తిలో సొసైటీలకు భాగస్వామ్యం కల్పించే విధంగా కార్యక్రమాలను రూపొందిస్తున్న క్రమంలో సమావేశం నిర్వహించగా.. హాజరై అన్వేష్‌రెడ్డిని కలిసినట్టు తెలిపారు. విత్తన ఉత్పత్తిలో మార్కెటింగ్ లో సొసైటీల భాగస్వామ్యాన్ని పెంచడానికి అభిప్రాయ సేకరణ చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా డిసిఓ రామ్మోహన్ వివిద జిల్లాల డిసిఒలు, జిల్లాకు ఇద్దరు చొప్పున సొసైటీ చైర్మన్లు, అడ్లూర్ ఎల్లారెడ్డి చైర్మన్ సదాశివరెడ్డి సి ఈ ఓ లు పాల్గొన్నారు.

ఏఈఓల సస్పెన్షన్ ఎత్తివేయాలి

నవతెలంగాణ-పిట్లం

రాష్ట్రవ్యాప్తంగా ఏఈఓల సస్పెన్షన్ ఎత్తివేయాలని మండల ఏఈఓలు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని తిమ్మా నగర్ రైతు వేదిక , రైతు నేస్తం కార్యక్రమం నందు ఏ ఈ ఓ లు నల్ల బ్యాడ్జీలతో నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్య పూరిత, ద్వంద వైఖరితో రాష్ట్రవ్యాప్తంగా సస్పెండ్ అయిన 160 మంది ఏ ఈ ఓ లను విధుల్లోకి తీసుకోకుండా తాత్సరం చేస్తున్నందుకు నిరసన కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. డిసిఎస్ సర్వేను కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించి సర్వే చేయించాల్సింది పోయి ఏఈఓల ద్వారా సర్వే చేయించాలి అని వ్యవసాయ శాఖ పై అధికారులు ఏ ఈ ఓలపై ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సస్పెండ్ అయిన ఏఈఓ ల సస్పెన్షన్ వెంటనే ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని , డిజిటల్ క్రాప్ సర్వే విషయంలో ఏ ఈ ఓ ల సమస్యల పైన చర్చించి పరిష్కార మార్గం చూపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఏఈవోలు లావణ్య , సురేష్ , ప్రదీప్ లు పాల్గొన్నారు.

ఫీడింగ్‌పై శిక్షణ

నవతెలంగాణ-ఎడపల్లి


మాట్లాడుతున్న ఐసిడిఎస్‌పిడి యస్‌కే రసూల్ బి

మండలంలోని జానకంపేట్ గ్రామంలోని రైతు వేదికలో బోధన్ ప్రాజెక్ట్ పరిధిలోని రెంజల్, ఎడపల్లి మండలాల అంగన్వాడీ టీచర్లకు, ఏఎన్ఎం, ఆశాలకు సూపర్‌వైజరీ సప్లిమెంటరీ ఫీడింగ్ ప్రోగ్రాంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా సంక్షేమ శాఖ (ఐసిడిఎస్‌పిడి) అధికారి యస్‌కే రసూల్ బి, రెంజల్, ఎడపల్లి మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాయిస్త ఫిర్దోస్, ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు విజయ్‌రాణి, పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ యన్ రాంబాబు, యు.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

మండలంలోని మంథని పాఠశాలలో బదిలీపై వెళ్లిన సరోజిని, రోజమణి, పోశెట్టి, రజినీకాంత్, శ్రీనివాస్ ఉపాధ్యాయులను మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజ్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శ్యామల, ప్రవీణ్ గౌడ్, గణేష్, శ్రీనివాస్, బసంత్, కిషన్, ఎస్ఎంసి చైర్మెన్ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్‌లు నిరుపేదలకు అందించాలి


మాట్లాడుతున్న సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సిరికొండ, ధర్పల్లి మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లను వెంటనే నిరుపేదలకు అందించాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయం ముందు సిరికొండ, ధర్పల్లి మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూములను నిరుపేదలకు తక్షణమే పంపిణీ చేయాలని అర్హులైన నిరుపేదలతో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్పల్లి, సిరికొండ రెండు మండలాల్లో గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూములు ఇవ్వలేక పూర్తిగా పేదలను మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వం చేసిన మోసానికి నిరసనగా ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధిచెప్పారని తెలిపారు. పదేండ్లుగా నిర్మాణం చేసినా.. కొన్ని నిర్మాణం పూర్తికాక నిరుపయోగంగా ఉన్నాయని అయినా పేదలకు మాత్రం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు ఆర్.దామోదర్, జి.సాయరెడ్డి, ఎం.లింబాద్రి, ఎస్.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో విధులు నిర్వర్తించాలి

- వైస్ ఛాన్స్‌లర్‌కు పొరుగు సేవల సిబ్బంది సన్మానం


వైస్ ఛాన్స్‌లర్‌ని సన్మానిస్తున్న యూనివర్సిటీ పొరుగు సేవల సిబ్బంది

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ నూతన వైస్ ఛాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ టి.యాదగిరి రావును యూనివర్సిటీ పొరుగు సేవల సిబ్బంది ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ బిల్డింగ్‌లో సన్మాన సభను మంగళవారం నిర్వహించారు. తమ సమస్యలపై వైస్ ఛాన్సలర్ యాదగిరిరావుకు పొరుగు సేవల యూనియన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధుల పట్ల నిబద్ధతో నిజాయితీగా ఉండాలని కోరారు. యూనివర్సిటీ అభివృద్ధికి ప్రతి ఒక్క ఉద్యోగి సహకారం అందజేయాలని కోరారు. ఉద్యోగుల పట్ల వారి సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ సన్మాన కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి, పొరుగు సేవల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు అందజేత


వెంకట్‌రాజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ముప్కాల్

కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యులు జోషి వెంకట్‌రాజ్ టై, బెల్టులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల తరపున ఆయనను శాలువాతో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘు, ఎస్సీ కాలనీ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఉమాశంకర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు శివశంకర్, డీలర్ రాజేశ్వర్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఛాన్స్‌లర్‌కు సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



తెలంగాణ యూనివర్సిటీకి నూతనంగా నియమితులైన వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావుకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్‌రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్‌కు తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు వివరించారు. అన్ని సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని సానుకూలంగా హామీఇచ్చినట్లు పానుగంటి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వినోద్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

విచారణలో విన్నపాలు

బీసీ కమిషన చైర్మన్‌కు బీసీ సంఘాల ఆధ్వర్యంలో వినతులు, సూచనలు.. జాతీయ బీసీ సంక్షేమ సంఘం నివేదికకు బీసీ కమిషన్ ప్రశంస

నవతెలంగాణ-విలేకరులు

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల దామాషా ఖరారుకు సంబంధించిన అంశంపై తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మంగళవారం బహిరంగ విచారణ చేపట్టింది. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా పలు బీసీ సంఘాల ఆధ్వర్యంలో బీసీ కమిషన్ ఎదుట సమస్యలను వివరించారు. పలు సూచనలు చేశారు.

బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తున్నారు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తున్నాయని, రాజకీయ పార్టీలు రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలను మోసపూరిత హామీలతో మాయ చేస్తున్నాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కమిషన్ బహిరంగ విచారణలో పలు అంశాలను ఆయన కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ బీసీలను నమ్మించి గొంతు కోసిందని, 25 శాతంగా ఉన్న రిజర్వేషన్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో 21శాతం మాత్రమే అమలు చేసి తీరని అన్యాయం చేసిందన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ.. తాము అధికారంలోకి వస్తే కులగణన చేపట్టడంతోపాటు బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. మూడు నెలల్లో బీసీ కులగణన చేపట్టి రిజర్వేషన్లను నిర్ధారించిన తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని గుర్తుచేశారు.

జనాభా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్


మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ జీ. నిరంజన్

జాతీయ బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ బీసీల అభ్యున్నతి, సంక్షేమంపై సమగ్ర నివేదికను బీసీ కమిషన్‌కు అందించింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అందించిన నివేదిక బాగుందని బీసీ కమిషన్ ప్రశంసించింది. ఈ విచారణలో రాజకీయ, విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాల్లో బీసీ జనాభా ప్రకారం రిజర్వేషన్లు, బడ్జెట్ కేటాయించాలని విన్నవించింది. నిజామాబాద్ జిలాల్లో బీసీ భవన్ నిర్మించాలని, బీసీ స్టడీ సర్కిల్‌కు రెండెకరాల స్థలం కేటాయించి స్వంత భవనం నిర్మాణం చేయాలని, కాలేజీ హాస్టళ్ల సీట్లను రెట్టింపు చేయాలని, మహాత్మ జ్యోతిబాపూలే, ఛత్రపతి శివాజీ జయంతులకు సెలవు దినం ప్రకటించాలని కోరింది. పెండింగ్‌లో ఉన్న రియింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లింది. సమగ్ర కులగణన అనంతరం కులాల జనాభా లెక్కలు బహిరంగ పర్చాలని కోరింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ నివేదికను, సంఘం జిల్లా అధ్యక్షులు కెంపుల నాగరాజు అందించిన సలహాలు, సూచనలను బీసీ కమిషన్ పరిగణలోకి తీసుకుంది. సంఘం నివేదికపై ప్రశంసలు కురిపించింది. ప్రస్తుత సమయంలో అతిపెద్ద బీసీ సంఘంగా గుర్తించబడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘంపై గురుతర బాధ్యత ఉందని గుర్తుచేసింది. బీసీ లెక్కలు తేలేలా సంఘం తరపున గ్రామగ్రామాన చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని బీసీ కమిషన్ చైర్మన్ జీ.నిరంజన్ సూచించారు. బీసీలందరూ కులగణనలో పాల్గొనేలా చూడాలని, అప్పుడే సామాజిక, రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ, విద్య రంగాల్లో బీసీల వాటా పెరుగుతుందని చెప్పారు. కమిషన్‌కు వచ్చిన బీసీల లెక్కల ప్రకారమే తాము చర్యలు తీసుకోగలమనే విషయాన్ని బీసీలు గుర్తించాలన్నారు. అనంతరం బీసీ కమిషన్ సభ్యులైన రాపోలు జయ ప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మిలను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వచ్చే నెల నవంబర్ 6నుంచి జరిగే సమగ్ర కుల గణన విజయవంతం చేస్తామని సంఘం నాయకులు మాటిచ్చారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగందుల మురళీ, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవంత్, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బొబ్బిలి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మణ రావు, బీసీ జర్నలిస్ట్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్ రాజు, జిల్లా నాయకులు సుభాష్, మండే మోహన్, ఆంజనేయులు, శివకుమార్ ముదిరాజ్, రఘురాం, అమంద్ ప్రవీణ్ కుమార్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నవాతే ప్రతాప్ పాల్గొన్నారు.

రాజకీయ చట్టబద్ధత తీసుకురావాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్



తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన బీసీ కుల గణన కోసం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ సభ్యుల ముందు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణలో బీసీ కుల గణన వెంటనే చేపట్టి కుల ఆధారిత బీసీలలో ఉన్నటువంటి విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయపరంగా చట్టబద్ధత తీసుకురావాలని డిమాండ్ చేశారు. కులగణన, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, చట్ట సభల్లో రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లు, పారిశ్రామిక రంగంలో సబ్సిడీలు భూముల కేటాయింపులు, విద్యా ఉద్యోగ ఉపాధి రంగంలో బీసీల జనాభా దామాషా రిజర్వేషన్లు, బీసీ సబ్ ప్లాన్, బడ్జెట్లో వాటా, వివిధ కులవృత్తుల వారికి/ సేవా కులాల వారికి ప్రత్యేక సబ్సిడీ పథకాలు ఇవ్వాలన్నారు.

శివాలయంలో అవకాశం కల్పించాలి

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల ధమాషాను ఖరారు చేసే అంశంపై బహిరంగ విచారణ కార్యక్రమంలో జంగమ సమాజం సభ్యులకు శివాలయ దేవాలయంలో అవకాశం కల్పించాలని బిసి చైర్మన్ నిరంజన్‌కు జంగమ సభ్యులు కోరా నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయంలో జంగమ జిల్లా కార్యదర్శి జంగం గంగప్ప వినతిపత్రం ద్వారా పట్టణ ప్రాంతంలో స్మశాన వాటికలకు 2ఎకరాల స్థలం కేటాయించాలని, స్థానిక ఎన్నికలలో జంగం కులం ఎంబీసీ కులానికి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా జంగమ సభ్యులు తదితరులున్నారు.

ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రిజర్వేషన్ల ఖరారు చేసే అంశంపై బహిరంగ విచారణలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మెతుకు శివ కుమార్ ముదిరాజ్, నగర ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రవి రాజ్, రమేష్, జాలిగం గోపాల్, భూమన్న, జిల్లా ముదిరాజ్ నాయకులు, మండల నాయకులు కలిసి ముదిరాజుల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు.


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు

వెదురు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్



మేదరి జిల్లా సంఘం ఆధ్వర్యంలో మేదరులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రాన్ని బీసీ కమిషన్ చైర్మెన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు దర్శనం దేవేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వెదురు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, అలాగే మేదరి ఫైనాన్స్ కార్పొరేషన్‌కు పాలకమండలి ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సూరినీడ పోశాద్రి, లీగల్ సలహాదారులు జె.సుదర్శన్, ప్రచార కార్యదర్శి దర్శనం గంగాధర్, నగర ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుమల, నగర కోశాధికారి పిల్లి రాజు, శేఖర్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం వినతి

నవతెలంగాణ-ఆర్మూర్

విశ్వబ్రాహ్మణ సమాజం పక్షాన కులగణనలో చేర్చాల్సిన అంశాలను, విశ్వబ్రాహ్మణ సమాజం స్థితిగతులు, ప్రభుత్వం పరంగా విశ్వబ్రాహ్మణ సమాజానికి అందించే సంక్షేమ ఫలాలు, కార్పోరేషన్‌ల ఏర్పాటు ఆవశ్యకతను కమిటీ సభ్యులకు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం తరపున వివరించారు. ఈ జిల్లా అధ్యక్షులు సత్యప్రకాశ్, ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాస్, కోశాధికారి సీతాపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పరిపూర్ణాచారి, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణాచారి, నగర అధ్యక్షులు సుధాకర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాఘవాపురం గోపాలకష్టాచార్య విశ్వబ్రాహ్మణ నాయకులు సింగోజు వెంకటేశం, పోల శంకర్, న్యాయవాది గంగాధర్, ఏజి దాస్, చంద్రయ్య, కట్కం ప్రభు పాల్గొన్నారు.

ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో జోనల్ స్థాయి ఎంపిక పోటీలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


కొనసాగుతున్న పోటీలు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో జోనల్ స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపిక పోటీల్లో కమ్మర్‌పల్లి జోన్‌లోని కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల్లోని వివిధ పాఠశాలల విద్యార్థులు సుమారు 200 మంది పాల్గొన్నట్లు స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జోనల్ కన్వీనర్ పసుపుల సాయన్న తెలిపారు. అండర్-17 బాలబాలికల ఖోఖో, అండర్-14 బాలబాలికల వాలీబాల్ విభాగాల్లో కమ్మర్‌పల్లి జోనల్ స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించారు. పోటీలో ప్రారంభ కార్యక్రమంలో క్రీడాకారులను స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగ రామస్వామి, గ్రామ అభివృద్ధి కమిటీ కోశాధికారి బుచ్చి మల్లయ్య క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు వేముల నాగభూషణం, నగేష్, మాధురి, జ్యోతి, రమేష్, పీఈటిలు సంజీవ్, బాలు, సింధుజ, తదితరులు పాల్గొన్నారు.

చెవిటి, మూగ పాఠశాలను సందర్శించిన శ్రీ భాషిత విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని శ్రీ భాషిత పాఠశాలకు చెందిన ఏడవ తరగతి విద్యార్థులు చెవిటి, మూగ పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా విద్యార్థులు తోటి విద్యార్థులతో గౌరవభావం, స్నేహం, మానవతా విలువలు తెలుసుకున్నట్టు తెలిపారు. అంతేకాకుండా విద్యార్థులు ప్రత్యక్షంగా ఒకరికి ఒకరు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీ పోలపల్లి సుందర్ మాట్లాడుతూ.. ఇటువంటి కమ్యూనిటీ రీచ్ కార్యక్రమాలు విద్యార్థులకు మంచిస్ఫూర్తిని అందిస్తాయన్నారు. అంతేకాకుండా సమాజంలో వివిధ ప్రాథమిక అవసరాలపై అవగాహన పెంచుకోవడానికి దోహదపడుతుందని చెప్పారు. విద్యార్థులు వారికి పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సాయిబాబాగౌడ్

- నియామకపత్రం అందజేత


నియామకపత్రం అదజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సాయిబాబా గౌడ్ మంగళవారం నియామకపత్రాన్ని అందుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరు సుదర్శన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్‌రెడ్డి సహకారంతో మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మెన్‌గా ఎన్నికైనందున పలువురు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వన్నెల్ దేవి లావణ్య, అయ్యప్ప శ్రీనివాస్, పండిత్ పవన్, కౌన్సిలర్ కొంత మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెల్మల్ గోపి, రవీందర్‌రెడ్డి, రాజు భాయ్, ఫాయిమ్ బాయ్, మైసిన్, ఎస్కే బబ్లూ, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గడుగు గంగాధర్‌కు సన్మానం


గంగాధర్‌ని సన్మానిస్తున్న దళిత కళ్యాణ్ సమితి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 29న రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులుగా నియమితులైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్‌కు దళిత కళ్యాణ్ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో వారి స్వగృహంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్‌ను సన్మానించిన వారిలో దళిత కళ్యాణ్ సమితి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి దౌలత్ చక్రి, రామచంద్ర గైక్వాడ్, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు అజయ్, నగర అధ్యక్షులు విజయ్ సాలంకి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు దత్తాత్రి, దళిత కళ్యాణ్ సమితి పట్టణ అధ్యక్షులు నవీన్, రామారావు, దేవరావు, శంకర్, విశాల్, భూషణ్, దయానంద్, సన్మానించిన వారిలో ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి క్రీడల్లో గోల్డ్ మెడల్


విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్‌సాయి

నవతెలంగాణ-మోపాల్

బోర్గం పి ప్రభుత్వ పాఠశాలకు చెందిన సాయి ప్రసన్నకు తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ఎస్‌జిఎఫ్ తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ శంకర్ సాయి తెలిపారు. మంగళవారం ప్రసన్నను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల వికారాబాద్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తైక్వాండో పోటీల్లో అండర్ 14 విభాగంలో ప్రాతినిధ్యం వహించి గోల్డ్ మెడల్ సాధించినట్టు వివరించారు. అలాగే ఈ సందర్భంగా తైక్వాండో చైర్మన్ బస్వాలక్ష్మీ నరసయ్య చేతుల మీదగా ఘనంగా సన్మానించారు.

కేజీబీవి విద్యార్థినులకు వైద్య పరీక్షలు



సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు వివరిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలోని కేజీబీవి పాఠశాలలో పీ.హెచ్.సీ వైద్యులు విద్యార్థినులకు వైద్య పరీక్షలను మంగళవారం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులను అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. పాఠశాలలోని వంట గదిని, పరిసరాలను పరిశీలించారు. వైద్యులు లింబారెడ్డి, మోతీరాం, ఇందిరా, ఏఎన్ఎంలు కల్పన, త్రివేణి పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

అనారోగ్యంతో బాధపడుతూ ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి మండలంలోని అడవి లింగాల గ్రామానికి చెందిన పోలీస్ శ్రీనివాస్ (43) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చూపించుకుని చికిత్స పొందినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడలేదు. ఈనెల 24న తన భార్య పొలం పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబీకులు హుటా హుటిన ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుండి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందాడు. అతని భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు.

అపార్ట్‌మెంట్ నిర్మిస్తామని బురిడీ కొట్టించారు..

- డబ్బులు ఇచ్చి నాలుగేండ్లయినా పనులు ప్రారంభం కాలే
- పారిజాతం బాధితుల ఆందోళన

నవతెలంగాణ-ఆర్మూర్

నిత్యం ఎక్కడో ఒకచోట మోసాలు జరుగుతూనే ఉన్నాయి. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ లోని పారిజాతం హోమ్స్ అండ్ డెవలపర్స్ ప్రవేట్ లిమిటెడ్ కార్యాలయంలో లక్షల రూపాయల డబ్బులు చెల్లించిన 40 మంది బాధితులు మంగళవారం కార్యాలయంలో బైఠాయించి ధర్నా చేశారు. బాధితుల మాట్లాడుతూ.. పెర్కిట్ శివారులో పారిజాతం ప్రైవేట్ లిమిటెడ్ యజమానులు స్థలాన్ని కొనుగోలు చేసి అపార్ట్ మెంట్ నిర్మిస్తామని చెప్పారన్నారు. టుబి, త్రీబి పోర్షన్‌లు కావాలనుకునే వారు ఒకేసారి డబ్బులు చెల్లిస్తే ధర తగ్గిస్తామని చెప్పారని తెలిపారు. టుబి, త్రీబికి వేరే వేరే ధరలు నిర్ణయించారన్నారు. దీంతో రిటైర్డ్ ఉద్యోగులు, కొందరు రైతులు, మధ్యతరగతి వారు కలిసి సుమారు ఒక్కొక్కరు సగటున రూ.20 లక్షల చొప్పున నాలుగు సంవత్సరాల కిందట ఏజెంట్ ద్వారా పారిజాతం సంస్థకు డబ్బులు చెల్లించినట్లు తెలిపారు. 40 మంది కలిసి సుమారు 20 లక్షల చొప్పున రూ.8 కోట్లు ఇచ్చామన్నారు. నాలుగు సంవత్సరాల కిందట డబ్బులు తీసుకున్న తర్వాత అపార్ట్మెంట్ పనులు ప్రారంభిస్తామని నమ్మించారన్నారు. నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు అపార్ట్మెంట్ పనులు ప్రారంభించక పోవడంతో ఆందోళనకు గురవుతున్నామన్నారు. అనేకసార్లు పారిజాతం కార్యాలయం చుట్టూ తిరిగామన్నారు. కొన్నిసార్లు హైదరాబాద్‌కు వెళ్లి ప్రధాన కార్యాలయంలో ఉన్న వారితో మాట్లాడామని తెలిపారు. పనులు ప్రారంభిస్తామని యాజమాన్యం చెప్పిన ఇప్పటివరకు అపార్ట్మెంట్ పనులు ప్రారంభించలేదని వివరించారు. డబ్బులు చెల్లించిన 40 మంది పారిజాతం కార్యాలయంలో బైఠాయించి ధర్నా చేశారు. అపార్ట్మెంట్ పనులు ప్రారంభించకుంటే తమకు ఆత్మహత్యే గతి అని ఆవేదనకు లోనయ్యారు. కష్టపడి దాచుకున్న డబ్బుతో సొంతింటి కల నెరవేరుతుందనుకుంటే తాము నిలువునా మోసపోయామని చెప్పారు. డబ్బులు తీసుకున్న పారిజాతం యాజమాన్యం ఆర్మూర్‌కు వచ్చి తమను కలిసి పనులు ప్రారంభించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

బైపాస్ రోడ్డుకు మోక్షం

- రోడ్డును పరిశీలించిన అధికారులు
- త్వరలో ప్రారంభంకానున్న రోడ్డు పనులు

: ఆర్మూర్ చిన్న బాలరాజ్

నవతెలంగాణ-ధర్పల్లి



పనులు చేపట్టే ప్రాంతం పరిశీలన

మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డుకు మోక్షం కలిగిందని, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు అయ్యాయని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ఆర్మూర్ చిన్న బాలరాజ్ అన్నారు. మంగళవారం పనులు జరిగే ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. త్వరలో రూ.30లక్షలతో మెయిన్ రోడ్డు నుంచి గోసంగి కాలనీ వరకు (మాల గుట్ట) బిటి రోడ్డుతోపాటు, డ్రైనేజీ పనులు ప్రారంభం కానున్నాయని హర్షం వ్యక్తం చేశారు. గత అనేక సంవత్సరాలుగా బైపాస్ రోడ్డుకు నిధులు కేటాయించాలని ఈ ప్రాంత వాసులు పలుమార్లు నాయకుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోలేదని అన్నారు. కార్యక్రమంలో పిఆర్ ఈఈ, డిఈ అహేమద్ హుస్సేన్, ఏఈ బాలాజీ, సొసైటీ చైర్మెన్ చెలిమెల మల్లికార్జున్, జేసీబీ శ్రీనివాస్, డొక్కా బాబు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను అన్ని విధాలుగా తీర్చిదిద్దుతాం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రాజిరెడ్డి

నవతెలంగాణ-బోధన్

గ్రంథాలయాలను అన్ని విధాలుగా తీర్చిదిద్దుతామని, పాఠకుల సౌకర్యార్థం కావలసిన సౌకర్యాలు కల్పిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రాజిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని శాఖ గ్రంథాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలించి, పాఠకులతో మాట్లాడారు. అనం తరం గ్రంథాలయ సమస్యలపై చర్చించారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని విద్యార్థులు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన చైర్మన్ రాజిరెడ్డి గ్రంథాలయానికి అవసరమైన మెటీరియల్ జాబితా తయారు చేసి అందించాలని గ్రంథ పాలకుడిని ఆదేశించారు. ఆయన వెంట కౌన్సిలర్లు తూము శరత్‌రెడ్డి, ఇమ్రాన్, తదితరులున్నారు.

మహారాష్ట్రకు వెళ్లిన కాంగ్రెస్ నాయకులు



తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-పోతంగల్/మద్నూర్

మహారాష్ట్రలో నామినేషన్ పర్వం మొదలైంది. దానిలో భాగంగా, మంగళవారం నాందేడ్ జిల్లా, ముఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి హన్మంత్‌రావు పాటిల్ నామినేషన్‌లో జాహిరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్, మాజీ జెడ్పి కోప్షన్ సభ్యులు రషీద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాలికుంటూ నివారణ టీకాలు వేయించాలి



టీకాలను వేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-మాక్లూర్

పశుపెంపకందారులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పకుండా వేయించాలని మండల పశువైద్యాధికారులు డా.ఉమామా సహెర్, డా.కిరణ్‌దేశ్ పాండే సూచించారు. మంగళవారం మండలంలోని గుంజిలి గ్రామంలో చేపట్టిన ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు రాకుండా రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని తెలిపారు. ఇందులో విఎల్‌ఓ వినిత, జేవీఓ కల్యాణి, విఏ పాశా గంగధర్, ఓఎస్ పుష్ప, హెచ్‌ఏ మహేశ్వరి, గోపాలమిత్ర సుధీర్, రైతులు, పాల్గొన్నారు.

భారతి నృత్యానికేతన్ చిన్నారుల ప్రతిభ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి భారతి నృత్యానికేతన్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్టు నాట్య గురువు సరోజ సుధీర్ మంగళవారం తెలిపారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించిన 2023-24 సంవత్సరానికి సంబంధించి శ్రీ జ్ఞాన సరస్వతి సంగీత నృత్య పాఠశాల నిర్వహించిన పరీక్షలలో సర్టిఫికెట్ సాధించినట్టు తెలిపారు. ఈ సంవత్సరం వార్షిక పరీక్షలో భారతీ నృత్యానికేతన్ విద్యార్థులు కూచిపూడి సర్టిఫికెట్ విభాగంలో సుస్వర ఫస్ట్ క్లాస్, నక్షత సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లితండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు కూడా డాన్స్ నేర్పడమే కాదు.. నృత్య విద్యలో వాళ్ళకు అనువైన సర్టిఫికెట్లను అనుభవమైన విశ్వవిద్యాలయాల్లో మాత్రమే వాళ్ళ ప్రతిభను కనబరిచే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు.

ఐటీహబ్‌లో తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్



వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఐటిహబ్‌లో పనిచేస్తున్న కార్మికులను విధుల్లో నుంచి తొలగించిన వారిని తక్షణమే తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఐటిహబ్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై కార్మిక శాఖ అధికారికి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న ఐటిహబ్‌లో పని చేయటానికి గత సంవత్సరం 2.8.2023న కరీంనగర్‌కు శ్రీ మిత్ర అసోసియేషన్ వల్ల హౌస్ కీపింగ్ కొరకు నియమించుకొని 15 మందిని విధుల్లో నుంచి పని మాన్పించి 15 రోజులు అవుతుందన్నారు. విధుల నుంచి మాన్పించడంతో కార్మిక కుటుంబాలు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రెండు నెలల బకాయి వేతనాలు ఇప్పటివరకు చెల్లించలేదని, వెంటనే కార్మికులకు విధుల్లోకి తీసుకొని బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనసూయ, రేఖ, అనిత, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను మంగళవారం పంపిణీ చేసినట్టు పశు వైద్యాధికారి డాక్టర్ విట్టల్ తెలిపారు. గ్రామంలో 295 ఆవులు, 145 పశువులకు టీకాలను పంపిణీ చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పశువైద్యాధికారులు నాగరత్న, గంగరాజు, సిబ్బంది సావిత్రి లక్ష్మణ్, గోపాలమిత్ర భాస్కర్‌గౌడ్, యశ్వంత్, స్థానిక రైతులు, పాల్గొన్నారు.

ఎన్నికలలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-రెంజల్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం రైతు సమస్యలపై స్థానిక తహసిల్దార్ శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పుట్టి నడిపి నాగన్న మాట్లాడుతూ.. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రూ.500 బోనస్, రైతు భరోసాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పరికోతలు చివరి దశకు వచ్చినప్పటికీ ఇంతవరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సన్నరకం, దొడ్డు రకం ధాన్యానికి రూ.500ల బోనస్ తప్పకుండా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ, కార్మిక సంఘం నాయకులు వడ్డెన్న, ఎస్కే నసీర్, సిద్ధ పోశెట్టి, గోపాల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ గ్రామంలోని పెద్దమ్మగుడి దగ్గర కొత్త బ్రిడ్జి నిర్మాణానికి రూ.80లక్షలు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మంజూరు చేసినట్టు ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనకరాజు తెలిపారు. మంగళవారం పంచాయతీరాజ్ ఏఈ సురేంద్ర వర్మ కొలతలు తీసుకున్నట్టు వివరించారు. ఈ నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే భూపతిరెడ్డికి తొర్లికొండ గ్రామస్తుల తరపున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఒకే బస్సు.. రెండే ట్రిప్పులు

- బోధన్ నుంచి మేడిపల్లి తాండకు..
- కిక్కిరుస్తున్న ప్రయాణికులు
- విద్యార్థులకు ఇబ్బందులు

నవతెలంగాణ-వర్ని(చందూర్)



బస్సులో కిక్కిరిసిన ప్రయాణికులు

బోధన్ డిపో నుంచి చందూర్ మండలం మేడిపల్లి తాండ వరకు బస్సులో వెళ్ళడానికి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ పాలనలో మండల సర్వసభ్య సమావేశంలో మేడిపల్లికి వచ్చే బస్సుతో పాటు మరో బస్సును కూడా నడిపించాలని బోధన్ డిపో మేనేజర్‌కు ప్రజాప్రతినిధులు కోరారు. నిత్యం బోధన్ పట్టణానికి, నిజామాబాద్ పట్టణానికి ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. ఉచిత బస్సు వసతి ఉండటంతో ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా అవుతున్నా ఒకే బస్సు రెండే ట్రిప్పులు తిరగటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒకే బస్సు రెండుసార్లు నడుపటంతో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ఇబ్బందిగా మారిందని, బస్సు మిస్సయితే డబ్బులు చెల్లించి ఆటోలో పోయే పరిస్థితి ఉందని ప్రయాణికులు, విద్యార్థుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోధన్ నుంచి రోజుకు రెండు బస్సులు నాలుగు ట్రిపులు నడిపితే ప్రయాణం ఇబ్బందిగా ఉండదని, అధికారులు మరో బస్సుతో పాటు ట్రిపులు కూడా పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మహిళా సంఘం డబ్బులు స్వాహా..

- ఏపీఎంకు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చిన వైనం

నవతెలంగాణ-ధర్పల్లి

సంఘం డబ్బులు కట్టాలని మహిళలు ఇచ్చిన రూ.3లక్షల 50వేలను వీవోఏ తుమ్మల గణేష్ కట్టకుండా సొంతంగా వాడుకున్నాడు. మహిళా సంఘం సభ్యులకు మోసంచేసిన ప్రయత్నం ఎట్టకేలకు మహిళా సంఘం సభ్యులు ఏపీఎంకు ఫిర్యాదు చేయడంతో బయటపడింది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని రేకులపల్లి గ్రామంలోని (ప్రేమ మహిళా సంఘం)లోని మహిళలు తమ సంఘంలోని డబ్బులు తమ అప్పు ఖాతాలో జమచేయాలని సదరు సంఘం సభ్యులు వీవోఏగా ఉన్న అదేగ్రామానికి చెందిన తుమ్మల గణేష్‌కు రూ.3లక్షల 50 వేలు ఇవ్వగా.. ఇదే అదునుగా భావించిన వివోఏ ఆ డబ్బులను కట్టకుండా సొంతంగా వాడుకున్నట్టు తెలిసింది. మహిళా సంఘాల ఆర్టీటీ సమయంలో సదరు సంఘం డబ్బులు బాకీ ఉన్నట్టు తేలడంతో ఒక్కసారిగా కంగుతిన్న సంఘం సభ్యులు, తాము డబ్బులు బాకీలేమని, బాకీ డబ్బులను వీవోఏ ద్వారా కట్టించామని మహిళలు ఏపీఎం సునీత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఏపీఎం.. వీవోఏ గణేష్‌ను పిలిపించి ఆరాతీయగా.. మరుసటిరోజు రూ. లక్ష 40వేలు సంఘం అకౌంట్‌లోకి బదిలీ చేసినట్లు తెలిసింది.

అలా ఎందుకు చేశావని నిలదీయగా తాను వాడుకున్నట్లు, అందులోని రూ.50 వేలు కార్యాలయంలోని మరొకరికి ఇచ్చినట్లు సదరు సంఘం మహిళలముందు బుకాయించినట్లు తెలుస్తోంది. దీంతో ఏపీఎం, మరికొందరు కలిసి రేకులపల్లి గ్రామంలోని సంఘం సభ్యుల ముందు విచారణ చేయగా తానే వాడుకున్నట్లు తప్పును ఒప్పుకొని మరి కొన్ని డబ్బులు కట్టినట్లు వెల్లడైంది. మరో రూ.50 వేలు నవంబర్ 15వరకు చెల్లిస్తానని సదరు వీవోఏ తెలిపినట్టు తెలిసింది. ఈ విషయమై ఏపీఎం సునీతను వివరణ కోరగా.. 'జరిగింది వాస్తవమే. పొరపాట్లపై తమకు వచ్చిన ఫిర్యాదుకు వెంటనే తాము సంఘ మహిళతో మాట్లాడినం. మొత్తానికి డబ్బులు రికవరీ అయ్యాయి.' అని ఆమె తెలిపారు.

గత ప్రభుత్వం ధాన్యం పేరిట రూ.58 కోట్ల దుర్వినియోగం చేసింది

- సహకరించిన అధికారులపై వేటు
- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-రెంజల్/బోధన్



రెంజల్ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు పేరిట రూ.58 కోట్ల దుర్వినియోగం చేసిందని, ఆ వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని రెంజల్ సింగిల్ విండో, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రైస్ మిల్లులు వందల కోట్ల రూపాయలను మోసం చేశారని, 90శాతం బియ్యం చేసిన వారికి ఈసారి ధాన్యం కేటాయించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 300 రైస్ మిల్లులలో కేవలం 135 మిల్లులను మాత్రమే గుర్తించినట్టు చెప్పారు. దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 85శాతం పెద్ద రైతులు ఇప్పటికే ధాన్యాన్ని విక్రయించుకున్నారని కేవలం చిన్న సన్నకారు రైతులు మిగిలారని వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి రైతుకు రూ.500 బోనస్, విడతలవారీగా రుణమాఫీ చేపడుతున్నామని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు అనుభవజ్ఞులు ఉపాధ్యాయులను నియమించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబిన్‌ఖాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జి.సాయిరెడ్డి, రెంజల్ సింగిల్ విండో చైర్మన్ మొయినుద్దీన్, ఏపిఎం చిన్నయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, మాధవి, ఇందిరా రెడ్డి, స్థానిక నాయకులు జావిద్ ఉద్దీన్, ఓ.మోహన్, తహసిల్దార్ శ్రావణ్ కుమార్, డైరెక్టర్లు అంజయ్య కురుమే శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్లు అగ్గు నారాయణ, చంద్రకళ, సీఈవో ఇంద్ర కరణ్, లచ్చే వార్ నితిన్, కార్తీక్, సురేష్, సిసిలు శివకుమార్, శ్యామల, మాధవి, తస్లీమా, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటుచేయడం అభినందనీయం..

బోధన్ :

బోధన్ లయన్స్ కంటి ఆసుపత్రిలో రోగుల సౌకర్యార్థం కొత్త అంబులెన్స్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో గల లయన్స్ కంటి హాస్పిటల్లో ఆయన నూతనంగా నియమించిన రెండవ ఆపరేషన్ థియేటర్‌ను, అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లయన్స్ కంటి హాస్పిటల్ కంటి రోగులకు ఉత్తమ సేవలు అందిస్తూ దినదినాభివృద్ధి చెందిందని అన్నారు. నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందించి వారిని ఆదుకోవడం ఎంతో మంచిదన్నారు. అనంతరం ఆయన బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. త్వరలో ఇంజనీర్ల బృందం వచ్చి ఫ్యాక్టరీని పరిశీలిస్తారని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి, లయన్స్ కంటి హాస్పిటల్ వ్యవస్థాపకనులు బసవేశ్వర రావు, లయన్స్ క్లబ్ ముఖ్య ప్రతినిధి లక్ష్మి, న్యాయవాది నరసింహారెడ్డి, కౌన్సిలర్ శరత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వృద్ధాప్యంలో ఆరోగ్య బీమా పథకం ప్రారంభం

నవతెలంగాణ-రెంజల్

వృద్ధాప్యంలో ఆరోగ్య బీమా పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారని డాక్టర్ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. 70 సంవత్సరాల పైబడిన వృద్ధులు ఈ పథకానికి అర్హులని ఆయన అన్నారు. ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ యోజన లబ్ది పొందేందుకు 70 సంవత్సరాల పైబడిన వృద్ధులు ఆయుష్మాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వారికి రూ.5లక్షల వరకు వైద్య సదుపాయం అందజేయనున్నట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకం వృద్ధులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి శ్రావణ్ కుమార్, సిబ్బంది రామకృష్ణ, చిన్నయ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కగింజా కొనలే

- అర్భాటంగా ప్రారంభించినా.. తూకం వేస్తలే
- అనుమతిరాలేదంటున్న అధికారులు.. ఎక్కడి కుప్పలు అక్కడే
- అదును చూసి దండుకుంటున్న దళారులు
- క్వింటాల్‌కు 1,800-1,900కే చెల్లింపుతో తీవ్రంగా నష్టపోతున్న రైతులు


బీబీపేట్‌లో

కొనే దిక్కేలేదు

రైతు గోపారావు వడ్లం



నాకు మూడెకరాల పొలం ఉన్నది. సెంటర్‌కు వడ్లు తెచ్చి పన్నెండు రోజులైతం ది. వానకు నానుతు న్నవి. ఎండకు ఎండుతున్నాయి. తడిసినప్పుడల్లా తిర్లమర్ల పోతున్నాం. మాకు ఇంకో పనేలేదు. మబ్బులు పడుతున్నప్పుడల్లా జల్లుమంటుం ది. అక్కడక్కడ సెంటర్లు స్టార్ట్ చేసినా గింజలైతే కొంటలేరు. ఇప్పటికే రైతుబంధు పైసల్ ఇవ్వలేదు. అక్కడక్కడ బాకీలు తెచ్చి లాగోడిపెట్టుకున్నం. ఇగ గింజలేమి కొంటుందో లేదో అర్థమయితలేదు. చాలా మంది రైతులు తుట్టికే దళారీలకు అమ్ముకుంటుర్రు. మాపరిస్థితి ఏడికత్తదో.

సర్వీస్ రోడ్లపైనే పడుకుంటున్నా

రైతు కర్తాల్ నాయక్ పెద్దకొడప్ గల్



కోతలు కోసి 15 రోజులు అవుతుంది. పది రోజుల నుండి వాటిని ఎండబెట్టడా నికి నానా తిప్పలు పడ్డాము. రాత్రి వేళల్లో సర్వీస్ రోడ్లపైనే ధాన్యం దగ్గర రోడ్డుపైనే పడుకుంటున్నాము. వాన మొగులు అవుతున్నప్పుడు పానం బిక్కు బిక్కు మంటుంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పుడు రైతుల దగ్గర నుండి వడ్లు కొనుక్కోపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమే. ధాన్యం కొనుగోలు చేయనప్పుడు ఇంకా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఎందుకు.? మద్దతు ధర ప్రకటించడం ఎందుకు? ఇప్పటికైనా ప్రభుత్వం కొనుగోళు ప్రారంభించాలని వేడుకుంటున్నాం.

నవతెలంగాణ-గాంధారి/పెద్దకొడప్‌గల్/సిరికొండ

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆర్భాటంగా ప్రారంభిస్తున్నా.. ఇప్పటి వరకు ఒక్క గింజ ధాన్యమూ కొనుగోలు చేయలేదు. అధికారులను అడిగితే.. అనుమతి రాలేదంటూ కాలయాపన చేస్తున్నారు. అయితే రైస్‌మిల్లులను కేటాయించకపోవడంతో ధాన్యం తూకం వేయడం లేదు. దీంతో ఎక్కడి కుప్పలు అక్కడే దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ధాన్యం ఆరబెట్టడంతో తేమశాతం సైతం వచ్చిందని, వాతావరణం సైతం అనుకూలంగా ఉందని, వెంటనే కొనుగోలు చేపడితే రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది. ఏదైనా తుఫాను కారణంతో వర్షం కురిస్తే.. చేతికొచ్చిన పంట వర్షార్పణం అవుతదేమోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. దీన్ని అదును చూసి దళారులు రంగప్రవేశం చేశారు. క్వింటా ధాన్యానికి ఏకంగా 1800 నుంచి 1900 రూపాయలు ఇస్తూ రైతులను నిలువునా ముంచేస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. అటు పాలకులు, ఇటు అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తుండం గమనార్హం. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యంగా 396 కేంద్రాలను అధికారులు, పాలకులు ఆర్భాటంగా ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి సుమారు 20 రోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ఒక్క గింజ సైతం తూకం వేయకపోవడం గమనార్హం. కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నా.. రైస్‌మిల్లులను కేటాయించకపోవడంతో తూకం నిలిచిపోయింది. దీంతో ఎక్కడి కుప్పలు అక్కడే దర్శనమిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద, రోడ్ల మీద ఎక్కడి ధాన్యం అక్కడే ఉండిపోయింది.

జిల్లాలోని గాంధారి మండలంలో పరిశీలిస్తే గాంధారి సొసైటీ ఆధ్వర్యంలో 9, ముదిల్లి సొసైటీ ఆధ్వర్యంలో 12, ఐకేపీ ద్వారా 7 కేంద్రాలను ప్రారంభించి 15 రోజులు గడుస్తున్నా.. ఒక్క ధాన్యం గింజ కొన్న పరిస్థితి లేదు. కొనుగోలు చేసే ఉద్దేశ్యం లేనప్పుడు ఎందుకు ప్రారంభించారని రైతులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైస్‌మిల్లులు సీఎంఆర్ ధాన్యం తిరిగి ఇవ్వలేదు. పలువాటిల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రస్తుత ప్రభుత్వం రైస్‌మిల్లులకు బ్యాంక్ షూరిటీ ఇవ్వాలని కోరుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో రైస్‌మిల్లులు కేటాయించకపోవడంతో తూకం ప్రారంభం కాలేదు. అయితే ప్రభుత్వమే నేరుగా రైతుల ధాన్యం కొనుగోలు చేసి గోదాములకు తరలించనుందని, ఆ ఏర్పాట్లు చేయడంలో ఆలస్యం కావడంతో తూకం ఆలస్యమవుతున్నట్టు మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే రైతుల నుంచి సేకరించిన ధాన్యం నేరుగా గోదామ్‌కు, అక్కడి నుంచి రైస్‌మిల్లుకు తరలించాలంటే లోడింగ్, అన్‌లోడింగ్, రవాణా ఖర్చులు ఆర్థికభారం అయ్యే అవకాశం ఉంది. ప్రాక్టికల్‌గా కూడా సాధ్యం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతుండటంతో అధికారులు సైతం ఎటూ తేల్చలేని పరిస్థితి నెలకొంది.


సిరికొండలో కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

దండుకుంటున్న దళారులు..

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా తూకం వేయకపోగా.. వాతావరణ మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అదును చూసి దళారులు రంగ ప్రవేశం చేశారు. అందిన కాడికి రైతుల నుంచి దండుకుంటున్నారు. ఈ యేడాదికి కనీస మద్దతు ధర గ్రేడ్ 'ఏ'కు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 నిర్ణయించింది కానీ, దళారులు మద్దతు ధరకు మంగళం పాడుతున్నారు. క్వింటాల్‌కు 1,800-1900 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం ఎప్పుడు ప్రారంభిస్తుందో తెలియక పోవడంతో పాటు వర్షాభావ పరిస్థితులతో మరింత నష్టం వాటిల్లుతుందోనని ఆందోళనతో రైతులు నష్టానికే తమ ధాన్యం విక్రయించుకుంటున్న పరిస్థితి నెలకొంది.


పెద్దకొడప్‌గల్‌లో హైవే పక్కన ధాన్యం రాశులు

నష్టాలకే అమ్ముకున్న

రైతు గుర్నాపూర్ సాయిలు వడ్లం



నాకున్న నాలుగెకరాల పొలంలో 110 క్వింటాళ్ల వడ్లు వచ్చినయి. క్వింటాల్‌కు 1900కు అమ్మిన. సర్కారు మద్దతు ధర 2320 ప్రకటించింది. ఇప్పటి వరకు గింజలు కొన్న దిక్కులేదు. ఎక్కడ పడితే అక్కడ సెంటర్లు చాలు జేసుకుంటూ పోతున్నరు. గింజలు తీస్కొని పోతే వానత్తే సౌలతు లేదు. కొనేదాక సెంటర్లలో నీలుగాలే. తాలంటరు. జాలి పట్టలేదంటరు. ఎండలేదంటరు. గిట్ల కొర్రీలు పెట్టి క్వింటాల్‌కు ఏడు కిలోలు తరుగు జోకుతరు. అందుకే నష్టమొచ్చినా ప్రైవేటోళ్లకు అమ్ముకుంటున్నం.


సిరికొండలో ధాన్యం వద్ద బీడీలు చుదుతూ కాపలా ఉన్న మహిళలు


గాంధారిలో ఆరబెట్టిన ధాన్యంపై పట్టా కప్పివేత

కర్షకుల కష్టం కన్నీటి పాలు

నవతెలంగాణ- రామారెడ్డి

అకాల వర్షంతో, కోసి ఆరబెట్టిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. మండల కేంద్రంలో మంగళవారం ఒకసారిగా కురిసిన అకాల వర్షానికి రైతులు ఆరబెట్టిన వరి ధాన్యం కొట్టుకుపోవడం రైతును కలచివేసింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.... ప్రజా ప్రతినిధులు గత 20 రోజుల క్రితం ప్రారంభ లకు వచ్చి, కొబ్బరికాయలు కొట్టి వెళ్లారు గాని, కొనుగోలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్న, ప్రభుత్వ అలసత్వానికి ఆరుగాలం కష్టించి పండించిన పంట నీటి పాలు అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల అలసత్వమే నష్టానికి కారణమని, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే కాంటాలు ప్రారంభించి, కేంద్రాల నుండి వరి ధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ అడ్డుకుంటామని రైతులు హెచ్చరించారు.


తడిసిన దాన్యాన్ని చూపిస్తున్న రైతులు